

కుంభమేళాకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవరిలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసినట్లు డీఆర్‌ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07701 గుంటూరు - అజాంగడ్ రైలు జనవరి 24(శుక్రవారం) రాత్రి 11 గంటలకు గుంటూరులో బయల్దేరి 26న ఉదయం 6.20కి ప్రయాగ్‌రాజ్, మధ్యాహ్నం 12 గంటలకు బనారస్(వారణాసి), సాయంత్రం 5.15 గంటలకు అజాంగడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నంబరు. 07702 అజాంగడ్ - గుంటూరు రైలు జనవరి 26(ఆదివారం) రాత్రి 7.45కి బయలుదేరి 11.20కి బనాసర్, 27న వేకువజామున 4 గంటలకు ప్రయాగ్‌రాజ్, 28న ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.



బహిరంగ.. సిట్టింగ్‌లు

- ఖాళీ స్థలాలూ మద్యపాన కేంద్రాలు
- గంజాయి గుంపులతో భయానక పరిస్థితి
- మహిళలు, విద్యార్థినుల్లో భయాందోళనలు
- రోడ్లు, కూడళ్లలో మందుబాబుల హల్‌చల్

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఖాళీ స్థలాలు, పార్కులు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందుబాబుల సిట్టింగ్‌లతో సందడిగా మారుతున్నాయి. ఆ పరిసరాల వైపు పురుషులు కూడా వెళ్లేందుకు భయపడుతుంటారంటే మందుబాబుల హల్‌చల్ ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో విడతల వారీ మద్యపాన నిషేధం పేరుతో తీసుకువచ్చిన మద్యం పాలసీతో గతంలో రహస్యంగా సాగిన మద్యపానం రోడ్డెక్కింది. అప్పటి ప్రభుత్వంలో ప్రారంభమైన బహిరంగ మద్యపాన అరాచకం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో మొదలైన బహిరంగ మద్యపానం నేడు అతి పెద్ద సామాజిక సమస్యగా రూపుదాల్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ఈ ప్రమాదాన్ని అరికడుతుందని అంతా భావించారు కానీ.. నేటికీ ఈ సామాజిక జాడ్యం ప్రజలను వెంటాడుతోంది. 2019కి ముందు వరకూ మద్యం దుకాణాలు ప్రైవేటు యాజమాన్యాల కింద ఉండేవి. అప్పట్లో మందుబాబులకు షాపు నిర్వాహకులే పర్మిట్ రూములను ఏర్పాటు చేసేవారు. ఆ కారణంగా వారంతా ఆ షాపులోనే మద్యం తాగి ఇళ్లకు వెళ్లేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు లైసెన్సును రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి వరకూ నాలుగు గోడల మధ్య ఉండే మద్యపాన వ్యవహారం వీధుల్లోకి వచ్చిపడింది. కూటమి ప్రభుత్వం తిరిగి పాత విధానాన్ని ప్రవేశపెట్టినా బహిరంగ మద్యపానాలు మాత్రం గతంలో మాదిరిగానే కొనసాగుతున్నాయి. ఎక్కడంటే అక్కడ మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు ఎక్కడికక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. దర్జాగా రోడ్ల సమీపంలోనే బైఠాయించి నిస్సంకోచంగా మద్యం తాగుతున్నారు. పట్టణాల్లోని దుకాణాలు, చిల్లరకొట్లు, షాపుల ముందుండే అరుగులు, ఫుట్‌పాత్‌లు, ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలు, రోడ్డు మార్జిన్లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు, బస్ షెల్టర్లు, కల్వర్టులు, పబ్లిక్ పార్కులు, పాఠశాల ప్రాంగణాలు, గ్రామాల్లో ఉండే ముఖ్యమైన కూడళ్లను ఆక్రమించివేస్తున్నారు. నలుగురు కలిసి అక్కడే కూర్చుని మద్యం తాగుతున్నారు. మందుబాబులు గుంపులు, గుంపులుగా పోగుపడే విధానం వచ్చిన తర్వాత దాన్ని ఆసరా చేసుకుని గంజాయి గుంపు కూడా వీధుల్లోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడి చలామణి కారణంగా ముక్కుపచ్చలారని చిన్నారులు సహా అనేక మంది యువకులు గంజాయి మహమ్మారికి అలవాటు పడ్డారు. వారంతా మందుబాబులను ఆసరా చేసుకుని బహిరంగ ప్రదేశాల్లోనే గంజాయి తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయంగా స్థానిక ఎమ్మెల్యేలకే ప్రజలు గంజాయి, మందుబాబుల గుంపుల బైఠాయింపు, దాడులపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు అనేకం జిల్లాలో ఉన్నాయి. బహిరంగంగా గంజాయి, మద్యపానం కారణంగా ఉనికిలోకి వచ్చిన అరాచక గుంపులు సమాజానికి పెనుసవాలుగా మారుతున్నాయి. మహిళలు, విద్యార్థులు, యువతులు బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో అత్యవస రమైన పనులున్నా కూడా బయటికి రావడానికి జంకుతున్నారు. గడిచిన ఐదేళ్లలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయి. అత్యాచారాలు, హత్యలు, సామూహిక దాడులు మహిళలపై లెక్కకు మించి పెరిగాయి. ఎక్కడో దూరంగా జరిగే ఘటనలు జిల్లాలో రోజువారీ ఘటనలుగా మారిపోయి భయానక వాతావర ణం నెలకొంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మహి ళా భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన తాజా మద్యం పాలసీ మహిళలకు నిరాశనే మిగిల్చింది. పర్మిట్ రూము విధానం అమలు చేయకపోవడంతో బహిరంగ మద్యపానం నేటికీ రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుబాబుల వీధి విహారం యథేచ్ఛగా సాగుతోంది.



పీసీ చైర్మన్లుగా.. పులుకూరి పంతాని

- సాగర్, కేడబ్ల్యూడీల ఎన్నిక ఏకగ్రీవం
- వైఎస్ చైర్మన్లుగా చక్రపాణి, సునీల్‌చౌదరి
- ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ
- పల్నాడు, బాపట్ల జిల్లాలకు సాగర్ పీసీ పదవుల పంపకం
- బాపట్ల, గుంటూరు జిల్లావాసులకు కేడబ్ల్యూడీ పీసీ పదవులు
- ఆయకట్టు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తామన్న నేతలు



నాగార్జున సాగర్ పీసీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణికి డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని, ఎస్‌ఈ పీ కృష్ణమోహన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావును అభినందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, రామాంజనేయులు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు(కారంపూడి డీసీ అధ్యక్షుడు)ను, బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఉప్పలపాటి చక్రపాణి(కొనంకి డీసీ అధ్యక్షుడు)ని డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంతారావు, చక్రపాణిలకు కలెక్టర్ అరుణ్‌బాబు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. వీరిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, ఇరిగేషన్ ఈఈ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని డీసీల అధ్యక్షులు ఎన్నికకు హాజరయ్యారు. పీసీ చైర్మన్‌గా కాంతారావుకు రెండేళ్లు, తదుపరి మూడేళ్లు గోగినేని కోటేశ్వరరావు పేర్లను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

కాల్వ బాగుకు కృషి చేస్తాం : చైర్మన్, వైస్‌చైర్మన్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టడంతో అధ్వానస్థితికి చేరిన సాగర్ కాల్వల బాగుకు తాము కృషి చేస్తామని చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి తెలిపారు. సాగునీటి కాల్వల్లో గడ్డిపరక కూడా తొలగించలేదని కాంతారావు తెలిపారు. కుడి కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాల్వల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కాల్వలను (మిగతా 8వ పేజీలో)

సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం చేశారు.. సంఘాలను విస్మరించారు.. కాల్వల మరమ్మతులు మరిచారు.. అన్నదాతల గోడు అరణ్య రోదనగా మార్చారు.. మొత్తం మీద వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం సంక్షోభంలో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవనరులకు జవసత్వాలు తీసుకు వచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. తొలుత సాగునీటి ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టగా శనివారం పీసీ చైర్మన్ల ఎంపికతో ఆ క్రతువు ముగిసింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగ్గా చైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణిలను ఎన్నుకున్నారు. అమృతలూరు మండలం కూచిపూడిలోని కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్‌చౌదరిలను ఎన్నుకున్నారు. టీసీలు, డబ్ల్యూయూఏ, డీసీల పదవులలో అధ్యక్షులు ఇప్పటికే కొలువుతీరగా పీసీ చైర్మన్ల ఎన్నిక కూడా ముగియడంతో ఇక సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టడానికి పదవుల్లో కొలువుదీరిన వారు కృషి చేసే దిశగా ప్రభుత్వం మార్గనిర్దేశనం చేయనుంది.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్

అమృతలూరు, బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మోర్తోట డీసీ అధ్యక్షుడైన పంతాని మురళీధరరావును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చేబ్రోలు డీసీ అధ్యక్షుడైన కాకుమాను మండలానికి చెందిన నువ్వుల సునీల్‌చౌదరిని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 22 మంది డీసీలు హాజరు కాగా చైర్మన్ పదవికి మురళీధరరావు పేరును మొఖమాటం రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్ పదవికి సునీల్‌చౌదరి పేరును దద్దుకూటి బూషబాబు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. వెలిగొండ ప్రాజెక్టు ఎస్‌ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి చైర్మన్, వైఎస్ చైర్మన్లకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎస్‌ఈ వెంకటరత్నం, చీరాల డీఈ ఎన్‌కేవీ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భ్రష్టుపట్టించారు : మంత్రి పార్థసారథి

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్నిక అనంతరం మంత్రి, వేమూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు చైర్మన్, వైస్ చైర్మన్లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగు నీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సాగు నీటి రంగం కోసం చంద్రబాబు రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే వాటిని నాశనం చేసేదాకా జగన్ నిద్రపోలేదన్నారు. గత ప్రభుత్వం చేతకానితనం వల్ల సాగు నీటి రంగం (మిగతా 8వ పేజీలో)

8 ఇద్దరు రైల్వే అధికారులకు జాతీయ అవార్డులు

హాస్టల్ విద్యార్థిని ప్రసవం
- నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలింపు
- అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి

గోవా నుంచి గుంటూరుకు 6 అక్రమ మద్యం రవాణా
- పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనులు
పలు రైళ్ల రద్దు.. దారి మళ్లింపు
8



గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌ని కాపాడేందుకు
తెరచాటు ప్రయత్నాలు
- ఎన్‌వోసీ జీవోని సవరిస్తూ రహస్య ఉత్తర్వులు
- ఆర్‌టీవీ ద్వారా సేకరించిన టీడీపీ నాయకులు
- సీఎం చంద్రబాబుకు నివేదన

పథకాల అమలు బాధ్యత అధికారులదే

- తాగునీటి సరఫరాకు కేంద్ర నిధులను సమీకరిస్తా
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- కేంద్ర పథకాలపై ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్ సమీక్ష

గుంటూరు సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ 2047 ఆకాంక్షకు అనుగుణంగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి స్వర్ణాంధ్ర లక్ష్యానికి అనుగుణంగా కేంద్ర పథకాల అమలు బాధ్యత అధికారులదేనని కేంద్ర సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు తీరుపై శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరులో పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాకు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నిస్తామన్నారు. యూజీడీ పెండింగ్ పనుల పూర్తికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అంతకముందు సంబంధిత శాఖల అధికారులతో ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ అంశాల వారీగా పథకాలపై సమీక్షించి సూచనలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పనుల ద్వారా స్థిరాస్తుల ఏర్పాటు, కుంటల నిర్మాణం, పంట కాల్వల పూడికతీత పనులు ఎక్కువగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్‌పై నిర్లక్ష్యంతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసినా క్షేత్రస్థాయిలో ఉపయోగం లేకుండా ఉందన్నారు. జల్ జీవన్ మిషన్‌లో నీటివనరుల అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గతంలో జరిగిన పనుల్లో నాణ్యతను పరిశీలించి నిధుల దుర్వినియోగం జరిగితే చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించిన లే అవుట్లలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో ఇళ్లలో, జగన్ లే అవుట్లలో నిర్మించిన ఇళ్లలో పూర్తి అయిన వాటిలో లబ్ధిదారులు నివశించకపోవడంపై అధికారులు కారణాలు విశ్లేషించి నివేదిక అందించాలన్నారు. ఎక్కువ మంది స్వయం సహాయ సంఘాల సభ్యులను లక్‌పతి దీదీ పథకంలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నమో డ్రోన్ ద్వారా అందించే వ్యవసాయ డ్రోన్ల వల్ల కలిగే ప్రయోజనాలపై స్వయం సహాయక సంఘాలకు అవగాహన కల్పించాలన్నారు. సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలర్ యూనిట్లు ప్రజలు అత్యధికంగా ఏర్పాటు చేసుకునేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థలో విలీన గ్రామాలకు పూర్తిస్థాయిలో ఇంటింటికి కుళాయిల ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించేలా అమృత్ 2 పథకం ద్వారా ప్రతిపాదనలు అందించి అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న యూజీడీ పనుల పూర్తికి రివైజ్డ్ ప్రతిపాదనలు తయారు చేసి అందించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవతేజ, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్, డీఆర్వో ఖాజావలి, సీపీవో శేషశ్రీ, డ్వామా పీడీ శంకర్, హౌసింగ్ పీడీ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ బ్రహ్మయ్య, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, తెనాలి మున్సిపల్ కమిషనర్ జస్వంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కళ్యాణ్‌చక్రవర్తి, పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, పశుసంవర్థకశాఖ జేడీ నరసింహారావు, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఎస్‌ఈ దాసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



20 సూత్రాల అమలుపై కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చైర్మన్ లంకా దినకర్, కలెక్టర్ నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు ఎమ్మెల్యే నసీర్

యువతకు ఉపాధి అవకాశాల్లో చేయూత

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష


సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రస్తుత విద్యార్థులకు చేయూత అందిస్తామని, తమ ఆధ్వర్యంలో ఉన్న కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశాలు కల్పిస్తామని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం సందడి వాతావరణంలో 1995-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము (గుడివాడ), గౌతు శిరీష(పలాస) మాట్లాడుతూ విద్యార్థి దశలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునే ఈ ఆత్మీయ సమ్మేళనం, జీవితంలో మరువలేని ఒక అద్భుత ఘట్టం అన్నారు. ఉజ్వల భవిష్యత్తును అందించిన కళాశాలను మరువ కూడదని, రాష్ట్రంలోనే కాకుండా, దేశంలో కళాశాల అగ్రస్థానంలో ఉండటం తమకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్అండ్‌డి డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ ఎస్.వి. శ్రీనివాసరావు, కళాశాల పూర్వ విద్యార్థుల విభాగం కన్వీనర్ డాక్టర్ స్వర్ణశ్రీ, అధ్యక్షులు రత్న ప్రసాద్, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పురుషుల ఖోఖో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో రామకృష్ణ

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఖోఖో పురుషుల అంతర కళాశాల పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు పోటీలను శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, డీఎస్‌డీవో పి.నరసింహారెడ్డి తదితరులు ప్రారంభించారు. మొదటి రోజు పోటీల్లో విక్టరి డిగ్రీ కళాశాల, డీసీఆర్ఎం, డిగ్రీ కళాశాల ఇంకొల్లు, వాగ్దేవి డిగ్రీ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల వారు లీగ్‌లలో ప్రవేశించినట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పీపీ సత్యపాల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వాసవి విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యం, కళాశాల వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: రిక్షా కార్మికుడు మృతి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడు మృతి చెందాడు. చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కథనం ప్రకారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన కుంచల శివారెడ్డి(53) పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో రిక్షాబండి తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుంచల చిన సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి కార్యాలయ ఫిర్యాదులపై నిర్లక్ష్యం

● వారాల తరబడి పట్టించుకోని పోలీసులు
● సీఎం ఆదేశించినా స్పందించని వైనంపై బాధితుల్లో ఆందోళన
● ఎట్టకేలకు సీఎంఓ ఫిర్యాదులపై దృష్టి సారించిన ఎస్పీ
● ఆయా ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌హెచ్‌ఓలకు హెచ్చరికలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఆయా ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదులోని అంశాలు వాస్తవమైతే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున భూ కబ్జాలకు, తప్పుడు కేసులకు, అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకుండా అడ్డుపడ్డారు. ఫలితంగా ఎంతోమంది బాధితులు అన్యాయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినూత్నంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో నాటి వైసీపీ అక్రమాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరిస్తుండగా, మంత్రి నారా లోకేశ్ తన క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. స్వీకరించిన ఫిర్యాదులను వారు సంబంధిత జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు పంపుతూ తక్షణం విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, అదేవిధంగా మంత్రి లోకేశ్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఆయా కార్యాలయాల్లో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటుండగా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ఆయా కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తాము నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను, వారు అందుబాటులో లేని సమయంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి ఫిర్యాదు చేశామని తమకు న్యాయం జరుగుతుందని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే బాధితుల ఎదురుచూపులు రోజులు వారాలు దాటి నెలలు గడుస్తున్నా సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి బాధితులకు ఎటువంటి సమాచారం రాకపోతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. మరికొందరైతే తమ ఫిర్యాదులపై స్పందించలేదంటూ తిరిగి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ విధంగా సీఎంఓ నుంచి, అదే విధంగా మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత కార్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు జిల్లాలకు అందుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో బాధితులకు న్యాయం జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కొందరు అధికారులు ఆయా ఫిర్యాదులపై మొక్కుబడిగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమస్య పరిష్కారమైనట్టుగా ఏదో సమాధానం పంపుతున్నారు. సివిల్ వివాదమనో, గతంలోనే చర్యలు తీసుకున్నామనో తిరుగు సమాధానం పంపి చేతులు దులుపుకుంటున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే సీఎంవో, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల పేషీల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో అనేక మంది బాధితులు తిరిగి సోమవారం పోలీస్ కార్యాలయంలో జరిగే ఎస్పీ గ్రీవెన్స్‌కు హాజరై తాము సీఎంఓ, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని అయినప్పటికీ న్యాయం జరగలేదని వాపోతూ ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని స్టేషన్‌లలో అయితే ఆయా ఫిర్యాదులను కనీసం చదవకుండానే పక్కన పడేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయా ఫిర్యాదులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రతి ఫిర్యాదును వారు తమ రిజిస్టర్లో నోట్ చేసుకొని దానికి ఒక నెంబర్ కేటాయించి సంబంధిత జిల్లాలకు పంపిస్తున్నారు. వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించి (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) సమాధానం పంపాలంటూ కోరుతున్నారు. అత్యధికంగా జిల్లా కలెక్టర్లకు, అదేవిధంగా కొన్ని జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపుతున్నారు. అయితే ఆ విధంగా పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన ఫిర్యాదుల్లో అనేకం కనీసం విచారణకు కూడా నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సీఎంఓ ఫిర్యాదులపై నిర్లక్ష్యం పట్ల ఎస్పీ ఆగ్రహం

ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పట్ల జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సీఎం, ఇతర మంత్రులు, డిజిపి కార్యాలయాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించి స్టేషన్ల వారీగా వచ్చిన ఫిర్యాదులు ఎన్ని, తీసుకున్న చర్యలు ఏమిటి ..? పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి..? అందుకు గల కారణాలు ఏమిటి అనే దానిపై విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారులపై చర్యలకు కూడా సిద్ధమైనట్లు సమాచారం. జిల్లాకు సంబంధించి నాలుగైదు పోలీస్ స్టేషన్లలో ఆయా ఫిర్యాదులు నెలల తరబడి పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌ల వారీగా సీఎంవో నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకున్న చర్యలు, పెండింగ్ ఫిర్యాదులు వంటి వాటిపై కసరత్తు జరుగుతోంది. పెండింగ్ పిటిషన్లకు సంబంధించి ఆయా స్టేషన్ల జాబితాలో పాత గుంటూరు, నల్లపాడుతో పాటు మరికొన్ని స్టేషన్‌లు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు అయా ఫిర్యాదులపై జరిగిన జాప్యం నేపథ్యంలో ఇక నుంచి అయినా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు ఎస్పీ సతీష్ కుమార్ అన్ని పోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఫిర్యాదుల్లో వాస్తవికతపై విచారణ జరిపి అందులో వాస్తవం ఉంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

సమాజ వికాసానికి విద్యార్థులు దోహదపడాలి


డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమనీ, అందుకు తగినట్టుగా నేటితరం విద్యార్థులు అడుగులు వేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు వంటి ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవడానికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాలని, సాంకేతిక పురోగతికి సహకరించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గోవా నుంచి గుంటూరుకు అక్రమ మద్యం రవాణా

● పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు, ఏఈఎస్ వరదకుమారి

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తరలించి గుంటూరులో ఒక ప్రాంతంలో రహస్యంగా దాచి మద్యాన్ని సరఫరా చేస్తున్న ఒక కానిస్టేబుల్‌తోపాటు మరో ఐదుగురిని గుంటూరు టూటౌన్ ఎక్సైజ్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు శనివారం వివరాలు వెల్లడించారు. గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తీసుకువచ్చి అమ్ముతున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకమ్మశెట్టి మహేష్‌బాబు, గుంటూరుకు చెందిన బాజీబాబు, లక్ష్మారెడ్డి, గోపికృష్ణ, రామిశెట్టి శ్రీనివాసు, గోరంట్లకు చెందిన తుమ్మా మంగమ్మ తదితరులు సిండికేట్‌గా మారి మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతున్నారు. నాలుగు రోజుల క్రితం గుంటూరులో గోవా మందు అమ్ముతున్నట్టు ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 555 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కానిస్టేబుల్ మహేష్‌బాబుతోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో గుంటూరు ఈఎస్ అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు, టూటౌన్ సీఐ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రసవించిన విద్యార్థిని

● హాస్టల్‌లో నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలింపు
● అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి
● ఘటనతో ఉలిక్కిపడిన ప్రభుత్వ వర్గాలు
● పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తల్లిదండ్రులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నడిబొడ్డున అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థినిని ప్రసవించింది. నగరంలోని జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అదేవిధంగా కలెక్టర్, ఎస్పీ, ఐజి క్యాంపు కార్యాలయాలు, మరోవైపు నగరం పాలెం స్టేషన్.... నిత్యం వీవీపీల రాకపోకలతో కట్టుదిట్టమైన భద్రత నడుమ కొనసాగే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఓ విద్యార్థినిని ప్రసవించడం సంచలనం రేకెత్తించింది. . కలెక్టరేట్‌కు, కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి నడుమ పరివర్తన పేరుతో నడుస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థిని శుక్రవారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనతో ప్రభుత్వ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. విద్యార్థిని ప్రసవించే వరకు విషయం బయటకు రాకపోవడం పట్ల అధికార యంత్రాంగంతో పాటు పోలీసు వర్గాలు సైతం విస్మయానికి గురయ్యాయి. అసలు హాస్టల్స్‌లో ఏమి జరుగుతోంది..? నిఘా ఉందా..? వార్డెన్స్ ఏం చేస్తున్నారు..? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తమ కుమార్తె కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుంటుందని కలలుగన్న తల్లిదండ్రులు ఈ వార్తతో షాక్‌కు గురయ్యారు. పరివర్తన హాస్టల్‌లో ఉంటూ చిలకలూరిపేట రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో ఈ విద్యార్థిని బి ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతుంది. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన 19 సంవత్సరాల విద్యార్థినికి శుక్రవారం రాత్రి నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకోవాల్సిన యువతి తల్లి కావడం సంచలన కలిగించింది. ఓ విద్యార్థిని గర్భం దాల్చి ప్రసవించే వరకు ఎలా కనుక్కోలేకపోయారు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రేమ పేరుతో మోసం చేసిన బావ

తాజాగా పరివర్తన భవనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి తన మేనమామ కుమారుడి చేతిలో మోసపోయినట్లు తేలింది. దర్శి మండల పరిధిలోని ఓ గ్రామం కాగా, అదే గ్రామానికి చెందిన తనకు వరుసకు బావ అయ్యే వినోద్ అనే యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగదీసుకున్నట్లు తెలిసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. అయితే ఆ యువతి ప్రసవించే వరకు ఆమె గర్భవతి అనే విషయం ఇక్కడ హాస్టల్ వార్డెన్‌కు గాని, అక్కడ గ్రామంలోని తల్లిదండ్రులకు గాని తెలియదు. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు శనివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. జీజీహెచ్‌లో ఉన్న బాలింతను తల్లిదండ్రులు కలిసి బోరున విలపించారు. అయితే వినోద్ నుంచి గాని ఆయన కుటుంబ సభ్యుల నుంచి గాని ఎటువంటి సానుకూలమైన స్పందన రాలేదు. వాస్తవానికి వినోద్ పెళ్లికి అంగీకరిస్తే ఈ విషయాన్ని రెండో కంటికి తెలియకుండా తమ కుమార్తెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు భావించారు. వినోద్ కూడా పెళ్లికి అంగీకరిస్తారని ఆ యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు కూడా భావించారు. ఆ యువతి తల్లిదండ్రులు ఎట్టకేలకు శనివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేని నూతనంగా ముందుకు తీసుకెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తి కావడం, కొన్ని గ్రామాలు మినహా చాలావాటికి ఓఆర్‌ఐలు రావడంతో మిగతా ప్రక్రియని పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్ణయించింది. రీసర్వేని పటిష్టవంతంగా పూర్తి చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో మొత్తం 14 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. తాడికొండ(లచ్చన్నగుడిపూడి), మేడికొండూరు (మందపాడు), తుళ్లూరు (వడ్డమాను), పొన్నూరు (జడవల్లి), దుగ్గిరాల (పెరికలపూడి), చేబ్రోలు (మంచాల), కాకుమాను (పాండ్రపాడు), ఫిరంగిపురం (మేరిగపూడి), ప్రత్తిపాడు (మల్లాయపాలెం), పెదకాకాని (అనుమర్లపూడి), గుంటూరు పశ్చిమ (చినపలకలూరు), గుంటూరు తూర్పు (జొన్నలగడ్డ), తెనాలి(పెదరావూరు), కొల్లిపర(కుంచవరం) గ్రామాల్లో రీసర్వే తొలి దశలో జరగనుంది. ఈ గ్రామాల్లో మొత్తం భూముల విస్తీర్ణం 22,961 ఎకరాలున్నాయి. రోజుకు కేవలం 20 ఎకరాల్లో మాత్రమే రీసర్వేని నిర్వహిస్తారు. గ్రామాన్ని బ్లాకులుగా విభజించి బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో వీఆర్‌వో, వీఆర్ఏ, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక మండల సర్వేయర్ కూడా ఉంటారు. అడంగల్ ప్రకారం రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వే ప్రక్రియని వారి కనుసన్నల్లోనే చేపడతారు. రీసర్వేకి సంబంధించి గ్రామాల్లో దండోరా వేసి చెబుతారు. అలానే గ్రామసభలు కూడా నిర్వహిస్తారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, పాత హద్దురాళ్లు వంటివి అన్ని ప్రదర్శిస్తారు. జిల్లాలో మొత్తం 173 గ్రామాలుండగా వైసీపీ హయాంలో 62 చోట్ల రీసర్వే పూర్తి అయింది. ఓఆర్‌ఐ(ఆర్థోరెక్టిఫైడ్ రాడార్ ఇమేజ్) మ్యాప్‌లు సుమారు 64 గ్రామాలకు ఇంకా అందాల్సి ఉన్నట్లు సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్ తెలిపారు. ఇవి కూడా త్వరలోనే జిల్లాకు చేరతాయని చెప్పారు. ఏమైనా వివాదాలుంటే డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో జరిగే మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులలో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

రెండు స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణ



వేమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ను రెండు స్టేషన్‌లలో నిలుపుదల పునరుద్ధరణకు ఎట్టకేలకు రైల్వేశాఖ స్పందించింది. 2020 నుంచి ఐదేళ్లపాటు తెనాలి-రేపల్లె మార్గంలోని వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ స్టాప్‌లను రైల్వే శాఖ నిలిపివేసింది. దీంతో ఈ రెండు స్టేషన్‌ల పరిధిలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై రైల్వే శాఖ దృష్టికి అనేక వినతి పత్రాలు వెళ్లాయి. ఎక్స్‌ప్రెస్ రైలును రెండు స్టేషన్‌లలో నిలుపుదలను పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఈ విషయాన్ని నాటి ఎంపీ నందిగం సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాత్రం స్పందించలేదు. గుంటూరు జిల్లా రైల్వే బోర్డు కమిటీ సభ్యులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఢిల్లీలోని రైల్వేశాఖ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా లేఖలు పంపారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఒత్తిడి పెరగడంతోపాటు కూటమి ప్రభుత్వానికి చెందిన బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ స్వయంగా ఢిల్లీలోని రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే ఉత్తర్వుల కోసంగా కృషి చేశారు. శుక్రవారం రైల్వే శాఖ డిప్యూటీ కమిషనర్ దీనిపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 23 నుంచి వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో కూడా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ అయ్యాయి. టైం టేబుల్‌ను కూడా ప్రకటించారు. రైలు నంబరు 17645 డెల్టా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి వేమూరుకు రాత్రి 7.15 గంటలకు చేరుకుని 7.16 గంటలకు బయలుదేరి రేపల్లెకు వెళ్లనుంది. రైలు వేళలను వేమూరు, పల్లెకోన స్టేషన్ల పరిధిలో విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరిమళ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి నాగశ్రీ వందన పరిమళ భౌతికకాయానికి శనివారం అంత్యక్రియలు జరిపించారు. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పరిమళ భౌతికకాయం శుక్రవారం రాత్రి తెనాలి గాంధీనగర్‌లోని ఇంటికి చేరింది. భౌతికకాయాన్ని చూసేందుకు స్థానికులు భారీ సంఖ్యలో వచ్చారు. ఆమె తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు వారికి కంటతడి పెట్టించింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మృతదేహానికి నివాళులర్పించారు. పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

ఎముకల పటుత్వంపై నేడు ఉచిత పరీక్షలు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎముకల పటుత్వంపై ఆదివారం ఉదయం పదిన్నర గంటల నుంచి బ్రాడీపేట 4/9లోని విజయసాయి ధన్వంతరి ఆయుర్వేద వైద్యశాలలో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్లు డాక్టర్ డీవీ సీతారామకిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్ళు పైబడిన వారికి, అధికంగా నొప్పులు ఉన్న వారికి రూ. 2వేల వరకు ఉండే ఎముకల పటుత్వ పరీక్షలను జండు కంపెనీ వారి సహకారంతో ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంబేడ్కర్‌ను అవమానించడం దారుణం

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉచ్ఛరిస్తూ చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలను కేంద్ర మంత్రి అమిత్‌షా వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని విశ్లేషకులు ఆర్‌వీ సింగరయ్య డిమాండ్ చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ నిర్మాత కేంద్ర హోం మంత్రి అవమానించటం దారుణమంటూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కేవలం దళితులకే నాయకుడు కాదని, ఆయన ఈ జాతి ఆత్మ అన్న విషయాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అవమాన పరిచేవిగా ఉండటం దేశ ప్రజలను కలవరపాటుకు గురిచేసిందన్నారు. ఈ తరహా పెత్తందారీ పోకడలు భారత రాజ్యాంగపు స్ఫూర్తికి ప్రమాదకరమన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కృష్ణారావు, ఆర్ నాయుడు ప్రసాద్, భావన్నారాయణ పాల్గొన్నారు.

నగరంపాలెం సీఐగా నజీర్ బేగ్



గుంటూరు, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం షేక్ నజీర్ బేగ్ నియమితులయ్యారు. ఇప్పటివరకు నగరంపాలెం సీఐగా కొనసాగిన వీర నాయక్‌ని వీఆర్‌కు పంపుతూ, ఆ స్థానంలో పోలీస్ కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తున్న నజీర్ బేగ్‌ను నియమించారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న ఆయన కొంత కాలంగా తాడేపల్లి ఎస్‌హెచ్‌ఓ -2 గా అటాచ్‌మెంట్‌పై విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ నజీర్ బేగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని, ముఖ్యంగా గంజాయి, మాదక ద్రవ్యాలను విక్రయదారులను అణిచివేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, పేకాట, వ్యభిచారం వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అణచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నేరాల్లో పాల్గొనే రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి ముందస్తు చర్యలు చేపడతామని తెలిపారు. కాగా, 2009లో ఎస్ఐగా పోలీస్ శాఖలో అడుగుపెట్టిన నజీర్ బేగ్ సత్తెనపల్లిటౌన్, రూరల్, ముప్పాళ్ళ, బొల్లాపల్లి, నరసరావుపేట తదితర అనేక పోలీస్ స్టేషన్లలో పల్నాడు ప్రాంతంలో ఎస్సైగా విధులు నిర్వహించారు. 2021 లో ఆయన సీఐగా ఉద్యోగోన్నతి పొంది కొంతకాలం రేపల్లె సీఐగా విధులు నిర్వహించారు.

'కాపులు ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం'

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కాపులు ఐకమత్యంతో ఉంటేనే సమాజంలో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు బలిజ ఉప కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మ శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక లక్ష్మీపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపులు సామాజికంగా, విద్యా, ఆర్థిక, రాజకీయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. కాపులంతా ఏకతాటిపైకి రావాలన్నారు. ఈ సందర్భంగా కాపు బలిజ ఉపకులాల జేఏసీ నగర అధ్యక్షుడిగా పాతగుంటూరుకు చెందిన బిలా శ్రీనివాసరావును నియమిస్తూ నియామకపు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు గున్నం సాయిబాబు, గౌరవాధ్యక్షుడు చందనపు నాగరాజు, యూత్ అధ్యక్షుడు చింతం శ్రీనివాస రావు, చెలుబోయిన శ్రీనివాస్, ఆకుల బాబు పాల్గొన్నారు.

'ఆధార్' సమస్యలపై అవగాహన అవసరం

గుంటూరు సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులకు సంబంధించిన సమస్యలపై గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అవగాహన కలిగివుండాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి జిల్లా లోని ఆధార్ ఆపరేటర్లు, డిజిటల్ అసిస్టెంట్స్, ఎడ్యుకేషనల్ సెక్రటరీలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆధార్ సేవలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో యూఐడీఏఐ ప్రాజెక్టు మేనేజర్ షేక్ జావీద్, అసిస్టెంట్ మేనేజర్ భాను ప్రకాష్,డివిజినల్ అభివృద్ధి అధికారులు పిచ్చిరెడ్డి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో ఉన్నత బోధన అందించడమే లక్ష్యంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్‌పిడి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గుంటూరులోని పరీక్షా భవన్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారులు వన్ అండ్ టు ఒక్కరోజు సహిత విద్యా కార్యక్రమాలపై సదస్సు నిర్వహించినట్లు రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగుల కోసం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలపై అవగాహన అవసరమని తెలిపారు. ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దివ్యాంగుల నమోదు, పాఠశాలల్లో వారికి కల్పిస్తున్న సౌకర్యాలు యు డైస్ ప్లస్ సర్వేపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో సీవీ రేణుక, సహిత విద్యా కోఆర్డినేటర్ అన్నపూర్ణ, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మిషనరీ స్థలం కబ్జా ఘటనలో నిందితులపై చర్యలు తప్పవు

- రెడ్డిపాలెంలోని బాల వికాస కేంద్రాన్ని పరిశీలించిన కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే ఆనంద్ బాబు
- కూల్చిన చర్చి పునర్నిర్మాణానికి చర్యలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రెడ్డిపాలెం శివారులోని క్రైస్తవ మిషనరీ స్థలాన్ని వైసీపీ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నించడంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఈ మేరకు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం స్థానిక క్రైస్తవ నాయకులతో కలిసి బాల వికాస కేంద్రాన్ని సందర్శించారు. వైసీపీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి, కొందరు దుండగులు చర్చిని కూల్చడాన్ని వారు తీవ్రంగా పరిగణించారు. ఘటనపై వివరాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం చంద్రశేఖర్, ఆనందబాబు మాట్లాడుతూ ఈ నిర్మాణాలన్నీ స్థానిక క్రైస్తవుల కష్టంతో నిర్మించినవని, ఇలాంటి స్థలాన్ని సొసైటీ నిబంధనల ప్రకారం ప్రైవేటు వ్యక్తులకు అమ్మే అవకాశం లేదన్నారు. కేవలం ఇతర ట్రస్టులకు మాత్రమే అందజేసే అవకాశం ఉంటుందని చెప్పారు. ఒకవేళ క్రయవిక్రయాలు నిజంగా ఏమైనా జరిగి ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకోవాలే తప్ప, క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని అన్నారు. క్రిస్మస్ సమయంలో ఇలా ఎవరికి చెప్పకుండా, అర్ధరాత్రి నిర్మాణాలను పగలగొట్టడం విపరీత చర్యగా అభివర్ణించారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో ఇదే తరహాలో భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అటువంటి దుశ్చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సుమారు ఐదు దశాబ్దాలుగా పేద వర్గాలకు చెందిన విద్యార్థులను అక్కున చేర్చుకుని ఉన్నతంగా తీర్చిదిద్దిన అనాథ ఆశ్రమం స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి మిషనరీ స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి చర్చిని కూల్చి సుమారు రూ. 50 కోట్ల ఖరీదైన స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ఘటనపై క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. కూల్చిన చర్చిని పునర్నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంస్థ ద్వారా పేద వర్గాలకు చెందిన విద్యార్థులు, అనాదలకు ఉపయోగపడే కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానియేల్ (మ్యాని), అదేవిధంగా గుంటూరు ఆర్డీవో, వెస్ట్ తహసీల్దార్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్, సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, నల్లపాడు సీఐ వంశీధర్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.



కూల్చివేతకు గురైన క్రైస్తవ మిషనరీ సొసైటీ ప్రాంతాన్ని సందర్శించిన కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న చిత్రం



ఉత్తేజ్, ఎష్ణా దంపతులకు శుభాకాంక్షలు చెబుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు,గళ్లా మాధవి తదితరులు

వేడుకగా తాడిశెట్టి వివాహ రిసెప్షన్

- ఉత్తేజ్, ఎష్ణా దంపతులకు ప్రముఖుల ఆశీస్సులు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్ర జ్యోతి): నగర మాజీ డిప్యూటీ మేయర్, టీడీపీ నేత తాడిశెట్టి మురళీమోహన్ కుమారుడు ఉత్తేజ్, ఎష్ణల వివాహ రిసెప్షన్ కార్యక్రమం శనివారం రాత్రి మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో వేడుకగా జరిగింది. ఈ నెల 14న ఉత్తేజ్, ఎష్ణల వివాహ వేడుక ఢిల్లీలో జరిగింది. కాగా, తాడిశెట్టి మురళీమోహన్, ఆయన సోదరుడు మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకటరావుల ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన రిసెప్షన్‌కు పెద్ద ఎత్తున ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించారు. రిసెప్షన్ పురస్కరించుకొని వచ్చే అతిథులకు సరికొత్త రుచులతో ఆతిధ్యం ఇచ్చారు. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పి రెడ్డి, ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి (గుంటూరు పశ్చిమ), ప్రత్తిపాటి పుల్లారావు (చిలకలూరిపేట), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), భాష్యం ప్రవీణ్ (పెదకూరపాడు), తెనాలి శ్రావణ్‌కుమార్ (తాడికొండ), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు నంబూరు సుభాని, మద్దాళి గిరిధర్, సింగర్ సంధ్య పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మంత్రి నారా లోకేశ్ పంపించిన పట్టు వస్త్రాలను నూతన వధూవరులకు టీడీపీ నేతలు అందజేశారు.

ఆకట్టుకున్న కొండవీటి జ్యోతిర్మయి కీర్తనలు

ప్రముఖ ఆధ్యాత్మిక గాయకురాలు గురుకొండవీటి జ్యోతిర్మయి ఆలపించిన శ్రీవారి కీర్తనలుఆకట్టుకున్నాయి. రిసెప్షన్ సందర్భంగా కొండవీటి జ్యోతిర్మయి కీర్తనలు ఆలపించేలా ప్రత్యేకంగా వేదికను ఏర్పాటు చేశారు.



రజకుల ఆత్మీయ సభలో ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

టీడీపీతోనే రజకులకు రాజకీయ ప్రాధాన్యం: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బీసీ- రజక నాయకుల ఆత్మీయ సమావేశానికి మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ఎన్నో విధాలుగా టీడీపీ కృషి చేసిందని, ఎస్సీ జాబితాలో చేర్చేందుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని, అధ్యయన కమిటీ వేసిందని తెలిపింది. రజకుల కోసం దోబీ ఘాట్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా, ఉచిత విద్యుత్, ఆదరణ ద్వారా పని ముట్లు అందజేసిందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రజకులకు స్వర్ణయుగం అని అన్నారు.

కోలాహలంగా తెప్పోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీ రామనామక్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సందర్భంగా శనివారం శాంతి హోమం పూర్ణాహుతి, చక్ర తీర్థం సంప్రోక్షణ జరిగాయి. ఈ సందర్భంగా పద్మకర శాస్త్రి శ్రీరామ కర్ణామృతం పురాణం, మునిపల్లె రమణి భక్తి రంజని, నేమాని నాగలక్ష్మి కపిలేశ్వరం వారి భక్త రామదాసు హరికథ భక్తులను రజింపచేశాయి. అనంతరంసీతారామ పరివార తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. ధ్వజావరోహణం, ద్వాదశారాధన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం అద్దాలమహల్‌లో సీతారామ పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయని క్షేత్ర నిర్వాహకులు, మస్తానరావు, లీలాసుందరి తెలిపారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎస్ఈ మూర్తి, పాస్టర్ షారోన్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు

విద్యుత్ భవన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంగడిగుంటలోని విద్యుత్ భవన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జి ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి, రాజీవ్‌గాంధీ నగర్ ప్యారిస్ పోస్టర్ షారోన్‌కుమార్, ఇతర అధికారులు, ఉద్యోగుల సమక్షంలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ నేడు సమాజంలో అశాంతి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. క్రీస్తు బోధనల అనుసరణతోనే సమాజంలో శాంతి పెంపొందుతుందన్నారు. పాస్టర్ షారోన్‌కుమార్ మాట్లాడారు. అనంతరం పలువురు పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. జేఏవో కొక్కిలగడ్డ సారథి, ఈఈలు శ్రీనివాసరావు, సూర్యప్రకాశ్ రావు, ఏవో (ఫైనాన్స్) కృష్ణారెడ్డి, డిప్యూటీ ఈఈలు ఖాన్, విశ్వేశ్వరప్రసాద్, పీవో గిరిధరరావు, ఏఈలు సీహెచ్ చిట్టెమ్మ, శోభారాణి, వీరారెడ్డి, ఉద్యోగులు దాసుబాబు, మోషే రాజు, రమేష్‌బాబు, సత్యనారాయణ, ప్రసన్న పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి తదితరులు

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి:ఎమ్మెల్యే మాధవి

- ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విజ్ఞాన్ లారా కైవసం

గుంటూరు(విద్య),డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించడానికి నూతన క్రీడా పాలసీ ప్రవేశ పెట్టిందని, యువత చదువుతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవంలో ఆమె పాల్గొన్నారు. క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక వికాసంతో పాటు జాతీయ స్ఫూర్తి, దేశభక్తి అలవడతాయని చెప్పారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, డైరెక్టర్ డాక్టర్ పీ ఐజక్ ప్రసాద్ , ప్రిన్సిపాల్ డాక్టర్ పి సుబ్బా రావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కే సుస్మిత చౌదరి, ఫిజికల్ డైరెక్టర్ కే రవి పాల్గొ న్నారు. క్రీడల్లో వడ్లమూడిలోని విజ్ఞాన్ లార విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు.



ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ స్వతంత్ర

సృజనాత్మకంగా భాష్యం బ్లూమ్స్ స్టీమ్‌ఎక్స్‌పో

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నూతన బోధన పద్ధతుల ద్వారా విద్యా విధానంలో సాంకేతికతను జోడించి విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి భాష్యం విద్యాసంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయని ప్రముఖ పాథాలజీ డాక్టర్ స్వతంత్ర అన్నారు. గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక బ్లూమ్స్ వీబీసీ క్యాంపస్‌లో స్టీమ్ ఎక్స్పో పేరిట వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వతంత్ర మాట్లాడుతూ ప్రదర్శనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రాబోయే ప్రమాదాలను ముందుగానే గుర్తించి, వాటిని నివారించే పద్ధతులను వివరించడం ఎంతగానో ఆకట్టుకుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేతరామ్ బ్లూమ్స్ జెడ్ఓ వరలక్ష్మి, సెకండరీ ప్రిన్సిపాల్ గిరిజారాణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కవిత పర్యవేక్షించారు.



పోటీల్లో పాల్గొన్న మహిళా జట్లు

అంతర కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలు

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూ, కాకినాడ యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. ఉమాశంకర రెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలకు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి 200 మందికి పైగా మహిళా క్రీడా కారిణిలు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ పోటీలకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చార్టర్డ్ అకౌంటెంట్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, మహిళా క్రీడాకారులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడాపోటీల విభాగ సెక్రటరీ, డాక్టర్ జీపీరాజు, కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కళ్ళం మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ పీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



బెలూన్స్ ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న వీరభద్రస్వామి తదితరులు

ఉత్సాహంగా ప్రారంభమైన భవిష్యనిధి ఉద్యోగుల క్రీడలు

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక పలకలూరులోని విజ్ఞాన్ నిరులా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఉద్యోగుల సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కేంద్రీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ వీరభద్రస్వామి మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో మరింత ఉత్సాహంగా పనిచేయడానికి క్రీడలు దోహద పడతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల ఉద్యోగులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. భవిష్యనిధి కమిషనర్ ఇంద్రనీల్‌ఘోష్, గుంటూరు ప్రాంతీయ కమిషనర్ రాజేశ్వర్ రాజేశ్ ,సహాయ కమిషనర్ల మాధవశంకర్, విజయలక్ష్మీ, ఆర్ఎస్‌పి మెంబర్ డిసి రామారావు, రిక్రియేషన్ క్లబ్ కార్యదర్శి రమేష్‌బాబు, క్రీడా కార్యదర్శి కృష్ణార్జున, సాంస్కృతిక కార్యదర్శి సబీహబేగం, సుప్రజ, వెంకటప్రసాద్, విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే హాస్టల్లో విద్యార్థిని ప్రసవం

ఏఐఎస్ఎఫ్ ఆందోళన



జీజీహెచ్‌లోని కాన్పులవార్డు ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు

గుంటూరు, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : కేవలం అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో విద్యార్థిని ప్రసవించిందని ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నవ్య శ్రీ ఆరోపించారు. ఈ మేరకు శనివారం జీజీహెచ్‌లోని కాన్పుల వార్డు ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. హాస్టల్లో ఉంటూ బీ ఫార్మసీ చదువుతున్న విద్యార్థిని 9 నెలల గర్భిణిగా ఉండి ప్రసవించే వరకు తెలియలేదంటే హాస్టల్ వార్డెన్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ తరహా ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు. మూడు నెలల క్రితం నగరంలోని పట్టాభిపురంలో సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఇద్దరు బాలికలు అదృశ్యమైన రెండు రోజుల తర్వాత వారిని పట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ ఘటనలో ఇంతవరకు హాస్టల్ వార్డెన్ పై విచారణ చేయలేదన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన రావు జిల్లాకు వచ్చి ఐదేళ్లు అయినప్పటికీ హాస్టళ్లను సందర్శించకుండానే చేసినట్టు తప్పుడు రికార్డులు ప్రభుత్వానికి ఇస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఆఫీసుకు కూడా రావడం లేదని, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి సమస్యలను పట్టించు కోవడంలేదని ఆరోపించారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే డీడీ మధుసూదనరావు, ఏఎస్‌సిడబ్ల్యుఓ చెంచులక్ష్మిని, హాస్టల్ వార్డెన్ జయసుధను తక్షణమే విధులనుంచి తొలగించాలని కోరారు. ఈ మేరకు గుంటూరు జిల్లా రెవెన్యూ ఆఫీసర్ ఎస్కే ఖాజావలికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, సాయి, గౌతమ్ కిరణ్ వీరాంజనేయలు తదితరులు పాల్గొన్నారు

6 నుంచి అంగన్వాడీల నిరాహార దీక్షలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే ఏడాది జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు కలెక్టరేట్ ఎదుట నిరాహార దీక్షలు, 10న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏవీఎన్ కుమారి తెలిపారు. శనివారం స్థానిక పాతగుంటూరులోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చి ఖాళీల భర్తీ జరుగుతున్నాయని, గుంటూరు జిల్లాలో మాత్రం అధికారులు కృషి చేయడం లేదని విమర్శించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీల జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలలో వితంతువులకు ప్రభుత్వం అందించే వితంతు పెన్షన్ కూడా రద్దు చేసిందని విమర్శించారు. దీంతో పాటు అనేక సమస్యల పరిష్కారం కోసం నిరసనలకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు రత్న మంజుల, జీ ప్రేమలత, టీ రాధ, పీ దయమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులను దగ్ధం చేస్తున్న స్థానికులు, పాల్గొన్న సీపీఎం నాయకులు

సర్దుబాటు చార్జీలను విరమించుకోండి: సీపీఎం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): సర్దుబాటు చార్జీల పేరుతో భారాలు మోపడం, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని సీపీఎం నాయకులు అరుణ స్పష్టం చేశారు. ప్రజలపై సర్దుబాటు చార్జీల భారాన్ని వేయడాన్ని నిరసిస్తూ స్థానిక పాత గుంటూరు శాఖ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మసెంటర్ వద్ద విద్యుత్ బిల్లులను దగ్ధం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు డీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. నిరసనల్లో సీపీఎం నాయకులు ఎస్ కార్తీక్, కే గంగాధరరావు జే. నాంచారయ్య, గంగాధరరావు పాల్గొన్నారు.




రక్తదాన శిబిరంలో అంబటి, మోదుగుల, దయాసాగర్ తదితరులు

ఘనంగా వైసీపీ అధినేత జగన్ పుట్టినరోజు వేడుకలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ 52వ పుట్టినరోజు వేడుకలు నగరంలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఇతర నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, తూర్పు సమన్వయకర్త నూరిఫాతిమా, మిర్చి యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడు మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంగడిగుంటలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, తూర్పు సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డిలతో కలిసి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాదినేడి కిషోర్, పాకనాటి శివారెడ్డి, కొండా భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

అవయవ దానంతో మనిషి మరణించినా జీవించవచ్చు



రాజారత్నం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(విద్య),డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మనిషి మరణానంతరం తమ అవయవాల ద్వారా పదిమందికి జీవితాన్ని ప్రసాదించే వారు మరణించినా జీవించిన వారితో సమానమని శాసనమండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థలలో చురుకైన కార్యకర్తగా ఉన్న వల్లూరి సదా శివరావు తల్లి వల్లూరి రాజారత్నం మరణానంతరం కుటుంబసభ్యుల సహకారంతో శంకర నేత్రా లయానికి కళ్ళు, కాటూరి మెడికల్ కళాశాలకు పార్థివదేహాన్ని దానం చేశారు. స్థానిక శ్రీనగర్ 7/4 లోని వల్లూరి సదాశివరావు నివాస గృహంలో రాజారత్నం భౌతికకాయానికి ఎమ్మెల్సీ నివాళులర్పించారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక అధ్యక్షుడు వీ లక్ష్మణరెడ్డి, సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ నూతల పాటి తిరుపతయ్య, దాసరి హనుమంతరావు, మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, అవయవ దాన కమిటీ సమన్వయకర్త గద్దె రత్నశ్రీ, కందిమళ్ల శివప్రసాద్, శివాజీ, ఎండి ప్రసాద్, సిపిఎం నగర కార్యదర్శి నళినీకాంత్, ఎల్ భారవి, శివకృష్ణ పాల్గొన్నారు.

- ఎన్‌వోసీ జీవోని సవరిస్తూ రహస్య ఉత్తర్వులు
- ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నాయకులు
- సీఎం చంద్రబాబుకు నివేదన

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌ని కాపాడేందుకు తెరచాటు ప్రయత్నాలు



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నడిబొడ్డున తగిన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ హైరైజ్ బిల్డింగ్స్‌ని కాపాడేందుకు పైస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కీలకమైన రైల్వే ఎన్‌వోసీ రద్దుకు సంబంధించి సవరణలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందింది. మునిసిపల్ పరిపాలన శాఖలోనే కొంతమంది హైరైజ్ బిల్డింగ్స్‌ని నిర్మిస్తున్న వైసీపీ నేత అంబటి మురళీకృష్ణకు సానుకూలంగా అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎన్‌వోసీ రద్దు సవరణ ఉత్తర్వులు రహస్యంగా విడుదల చేయడం ఇందుకు ఊతమిస్తున్నది. రహస్య జీవో సమాచారాన్ని ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నేతలు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

భజరంగ్ జూట్‌మిల్లుకు చెందిన వివాదాస్పద స్థలాన్ని వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ తన ఆధీనంలోకి తీసుకొని తొలుత ఐదు అంతస్తుల అపార్టుమెంట్ల నిర్మాణానికి మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి అనుమతులు పొందారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో రివైజ్డ్ ప్లాన్ దరఖాస్తు చేసి దానికి అనుమతి రాకముందే 15 అంతస్తుల భవన సముదాయాలను నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నో నిబంధనలను అతిక్రమించారు. గుంటూరు - నల్లపాడు రైలుమార్గానికి ఆనుకునే నిర్మాణాలు చేపట్టారు. రైల్వే నుంచి ఐదు అంతస్తుల భవన సముదాయాలకు మాత్రమే ఎన్‌వోసీ తీసుకొన్నారు. ఎప్పుడైతే అంతకంటే ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టారో రైల్వే శాఖ తాను జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు అయినట్లే భావించాలని పేర్కొంటూ తగిన చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ అధికారులకు సమాచారం ఇచ్చింది. అయితే అప్పట్లో అంబటి మురళీకృష్ణ సోదరుడు అంబటి రాంబాబు మంత్రిగా ఉండడంతో ఏ ఒక్క ప్రభుత్వ శాఖ అధికారి, సిబ్బంది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ ప్రాంగణంలోకి అడుగుపెట్టే సాహసం చేయలేకపోయారు.

కాగా ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓటమిపాలై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆర్‌టీఐ ద్వారా ఉల్లంఘనలన్నింటిని వెలుగులోకి తీసుకొచ్చారు. 15 అంతస్తులకు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ రాకపోవడం, సెట్‌బ్యాక్స్ సరిగా లేకపోవడం, రైలు పట్టాల నుంచి దూరంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కేవలం 50 అడుగుల దూరంలోనే నిర్మాణాలు చేయడం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు లేకపోవడం వంటివి అనేక ఉల్లంఘనలు బయటకు వచ్చాయి. రైల్వే ఎన్‌వోసీ రద్దుపై కోర్టుకు వెళ్లినా అంబటి మురళీకృష్ణకు ఊరట లభించలేదు. కాగా మునిసిపల్ పరిపాలన శాఖలో కొంతమంది ఆయనకు సహకరిస్తున్నారన్న అనుమానాలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి కలుగుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది మునిసిపల్ అధికారులు, మురళీకృష్ణ సామాజికవర్గానికి చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ గుంటూరు జిల్లా నాయకులు సందేహిస్తున్నారు. ఎన్‌వోసీ రద్దు సవరణ జీవోని రహస్యంగా ఇచ్చిన విషయంపై తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. దీనిపై సీఎం ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సునీల్‌చౌదరికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి

(5వ పేజీ తరువాయి)

నాశనమైందన్నారు. సాగు నీటి రంగంలోని సమస్యలను గుర్తించి, రైతులకు మేలు జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మరుగునపడిన వ్యవస్థను గాడిలో పెడతానికి చంద్రబాబు నడుం బిగించారని ఇందులో భాగంగానే సాగు నీటి సంఘాల ఎన్నికలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగ పడే వ్యవస్థలను జగన్మోహనరెడ్డి నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయలు మాట్లాడుతూ సాగు నీటి రంగం చంద్రబాబు మానసపుత్రిక అన్నారు. నూతన కమిటీ ప్రతి ఎకరాకు నీరందించే విధంగా పని చేస్తుందన్నారు.

కాల్వలు, డ్రెయిన్లు ఆధునికీకరిస్తాం : చైర్మన్

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేయలేదన్నారు. పట్టిసీమ నీటిని కూడా అందించలేదన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించి సాగునీటిసంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అధ్వానంగా తయారైన కాల్వలు, డ్రెయిన్లను అభివృద్ధి చేసి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(5వ పేజీ తరువాయి)

ఆధునీకీకరించి సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కాల్వ చివరి భూములకు సాగునీ రు అందించేందుకు ప్రయత్నిస్తామని చక్రపాణి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్ల సాగునీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నీటి సరఫరాలో రైతులను భాగస్వాములను చేసిందన్నారు.



సాగర్ పీసీ చైర్మన్ ఎన్నికలో పాల్గొన్న డీసీల అధ్యక్షులు

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట : యరపతినేని

సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ ప్రాజెక్టు సాగునీరు అందిస్తున్నా వైసీపీ హయాంలో కాల్వల మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రులు, డీసీల సహకారంతో గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు.



చిక్కులను అవగతం చేసుకుని చదివితే..

భౌతికశాస్త్రంలో అత్యధిక మార్కులు సులువే



అడుసుమల్లి రవికుమార్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహజంగా విద్యార్థులు భయపడే సబ్జెక్టులలో భౌతిక శాస్త్రం కూడా ఒకటి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం సీబీఎస్ఈ పాఠ్య పుస్తకాలు ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రమంతటా స్టేట్ బోర్డు పరీక్షలను నిర్వహించడానికి సన్నద్ధమయింది. 2025లో జరిగే పదో తరగతి పరీక్షలలో సైన్స్ పరీక్ష భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాలకు విడివిడిగా వేర్వేరు రోజులలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందువల్ల అటు విద్యార్థుల్లోనూ ఇటు ఉపాధ్యాయుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే గతంలో రెండు సబ్జెక్టులను కలిపి ఒకే పేపర్‌గా నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయని పెదనందిపాడు మండలం, పుసులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, అడుసుమల్లి రవికుమార్ తెలిపారు. ఇక ఇప్పుడు 2025లో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో భౌతిక శాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి విద్యార్థులకు ఆయన ఇచ్చే సూచనలు ఇలా ఉన్నాయి...

- ఇప్పటికే అంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సిఆర్‌టి ద్వారా మోడల్ పేపర్లను, బ్లూ ప్రింట్‌ను విడుదల చేసి అన్ని పాఠశాలలకు పంపించి తగిన మార్గదర్శనం చేసింది. విద్యార్థులు ఈ బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తూ, ఆయా పాఠ్యాంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- భౌతికశాస్త్రం ప్రశ్నపత్రం మొత్తం నాలుగు సెక్షన్లుగా 17 ప్రశ్నలతో ఉంటుంది. మొదటి సెక్షన్‌లో 1 నుంచి 8 వరకు ఒక మార్కు ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎనిమిది ప్రశ్నలలో పటం వెయ్యడం, పట్టికను చూసి సమాధానాలు రాయడం, కారణాలు ఊహించడం ఉపయోగాలు తెలపడం, ప్రమాణాలు రాయడం అనే విద్యా ప్రమాణాలు కచ్చితంగా ఇస్తారు కాబట్టి విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలి.
- రెండవ సెక్షన్‌లో 9 నుంచి 11 వరకు రెండు మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వీటిలో రెండు ప్రశ్నలు కారణాలు ఊహించడం, ప్రశ్నించడం వంటి విద్యా ప్రమాణాలకు సంబంధించి ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఈ దిశగా సాధన చేయాలి.
- మూడవ సెక్షన్‌లో 12 నుంచి 14 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న సంఖ్య 12 పటం గీయాలి. ఈ ప్రశ్నకు అంతర్గత ఎంపిక ఉంటుంది విద్యార్థులు గనక పటాలను చక్కగా సాధన చేసినట్లయితే, ఈ ప్రశ్న ద్వారా సులువుగా నాలుగు మార్కులను పొందవచ్చు. ముఖ్యంగా పుటాకార దర్పణం, కుంభాకార కటకానికి సంబంధించిన కిరణ చిత్రాలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- ఇదే సెక్షన్‌లో ఉపయోగాలు రాయడం విద్యా ప్రమాణానికి సంబంధించిన ప్రశ్న కూడా ఉంటుంది కాబట్టి బ్లీచింగ్ పౌడర్ ఉపయోగాలు, బేకింగ్ సోడా ఉపయోగాలు, వాషింగ్ సోడా ఉపయోగాలు, నిజ జీవితంలో లోహాల పాత్ర, పి.హెచ్ ప్రాముఖ్యం తదితర అంశాలను విద్యార్థులు క్షుణ్ణంగా చదివి నాలుగు మార్కులను సంపాదించే ప్రయత్నం చేయాలి.
- ఇక మరో ప్రశ్నగా పట్టిక ఇచ్చి పట్టిక కింద ప్రశ్నలు అడుగుతారు కాబట్టి పాఠ్య పుస్తకంలో ఇచ్చిన పట్టికలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- నాలుగో సెక్షనులో 15 నుంచి 17 వరకు 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. 15వ ప్రశ్న భౌతిక శాస్త్రం నుంచి, 16వ ప్రశ్న రసాయన శాస్త్రం నుంచి, 17వ ప్రశ్న భౌతిక రసాయన శాస్త్రాల అంతర్గత ఎంపిక తోనూ ప్రశ్నలను అడుగుతారు.
- ముఖ్యంగా 17వ ప్రశ్న ఒక కృత్యాన్ని గురించిన ప్రశ్న కావడం వలన విద్యార్థులందరూ కూడా కృత్యాలకు సంబంధించిన ప్రశ్నలను సాధన చేసినట్లయితే కచ్చితంగా ఎనిమిది మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- ప్రశ్నపత్రం మొత్తం మీద విషయావగాహన, అంశాలను వివరించడం, కృత్యాలను రాయడం, ప్రశ్నించడం, ఊహించడం, కారణాలు తెలపడం, ఉపయోగాలు రాయడం, ప్రమాణాలు రాయడం, పటాలు గీయడం వంటి విద్యా ప్రమాణాలను సాధన చేస్తే విద్యార్థులందరూ దాదాపు 70శాతం మార్కులను తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- భౌతిక శాస్త్రం అనగానే విద్యార్థులలో సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రంలోని బ్లూప్రింట్ వెయిటేజ్‌ను దృష్టిలో ఉంచుకొని పరీక్షలకు సన్నద్ధమైతే విజయం తథ్యమని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అడుసుమల్లి రవికుమార్ వివరించారు.

- ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు... అడపా దడపా కొనుగోళ్ళు
- కిలో రూ.250కు విక్రయం

మార్కెట్లోకి మామిడి పండ్లు



మార్కెట్లో దర్శనమిస్తున్న మామిడి పండ్లు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో మామిడి పండ్లు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా మామిడి పండ్లు వచ్చే రుతువుకు భిన్నంగా మార్కెట్లోకి రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. లాలాపేట పండ్ల మార్కెట్లో రెండు రోజులుగా తోపుడు బండిపై మామిడి పండ్లు కనిపించడంతో ప్రజలు అడపా దడపా కొనుగోళ్ళు చేస్తున్నారు. సాధారణంగా మండు వేసవిలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అలాంటిది రుతువుకు భిన్నంగా ప్రస్తుతం బంగినిపల్లి మామిడి పండ్లు మార్కెట్లో దర్శనమివ్వడంతో ప్రజలు ఆశ్చర్యంగా పరిశీలిస్తున్నారు. కొనుగోలు చేసేందుకు కొందరు ఆసక్తిగా చూపుతున్నారు. డజను పండ్లు రూ. 800ల నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తుండగా కిలో రూ.250ల వరకు విక్రయిస్తున్నట్లు లాలాపేటలో పండ్ల వ్యాపారి షేక్ జిలాని తెలిపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో బంగినపల్లి మామిడి పంట అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాలకు ఆయా మామిడి పండ్లను ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా విక్రయాలు జరుపుతున్నామని, అడపా దడపా కొనుగోళ్ళు జరుగుతున్నాయని సదరు వ్యాపారి వివరించారు. మరికొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎన్నారై నూకవరపు శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ఉపాధ్యాయులచే రూపొందించబడిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ సెక్షన్‌లో మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు నుంచి ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు రైలును ఈ నెల 28, 29, జనవరి 2, 5, 7, 8, 9 తేదీల్లో పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 17201/17202 గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు నంబరు. 18519 విశాఖపట్టణం - ముంబై ఎల్‌టీటీ, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నంబరు. 18045 షాలిమార్ - హైదరాబాద్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు నంబరు. 18046 హైదరాబాద్ షాలిమార్, నంబరు. 17205 సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్టు రైలుని జనవరి 7న, నంబరు. 17206 కాకినాడ పోర్టు - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17207 సాయినగర్ షిర్డి - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17208 మచిలీపట్నం - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ - వికారాబాద్ మీదగా దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నంబరు. 11019 ముంబై సీఎస్‌ఎంటీ - భువనేశ్వర్, నంబరు. 11020 భువనేశ్వర్ - ముంబై సీఎస్‌ఎంటీ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు, వాడి - వికారాబాద్ - సికింద్రాబాద్ - పగిడిపల్లి - గుంటూరు - విజయవాడ మీదగా దారి మళ్లిస్తామన్నారు. నంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 1, 8 తేదీల్లో, నంబరు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి -సికింద్రాబాద్ మార్గంలో దారి మళ్లిస్తామని తెలిపారు. నంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న రాజమండ్రి - విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ మీదగా దారి మళ్లిస్తామన్నారు. ఆపరేషనల్ కారణాల వలన ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నంబరు. 07276 కాచీగూడ - మిర్యాలగూడ, నంబరు. 07277 మిర్యాలగూడ - నడికుడి, ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు నంబరు. 07973 నడికుడి - మిర్యాలగూడ, నంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ రైళ్లను రద్దు చేశామన్నారు. నంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నంబరు. 07792 నడికుడి - కాచీగూడ రైలుని ఈ నెల 26 నుంచి జనవరి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజ పురోగతి

- మన్నవ మోహనకృష్ణ



రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్లో పాల్గొన్న ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజం పురోగమిస్తుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఎస్సార్ఎం యూనివర్శిటీలో శనివారం జరిగిన రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సమా జానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, టెక్నాలజీతో సమాజం మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. నూతన టెక్నాలజీని కనుగొనేం దుకు చేసే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహం అందిస్తుందని చెప్పారు. నేటి తరానికి టెక్నాలజీపై అవగాహన ఉండటం అవసరమని అన్నారు.

- శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి

శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి సాధ్యమని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. విజయవాడలోని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో విభాగాధిపతులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విభాగాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ద్వారా అందిస్తున్న సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ప్రొక్యూర్మెంట్స్ ఇంకా విస్తృత పరిచి ఏపీటీఎస్‌కి మరింత ఆదాయం పెంచాలని సూచించారు.

174 వసంతాల ఆర్‌సీఎం చర్చి



రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా రెంటచింతలలో నిర్మించిన చర్చిలు జిల్లాకే తలమానికంగా ఉంటాయి. ఎంతో ఎత్తుండే ఈ ప్రార్థనాలయాల శిఖరాలను చూడడానికి తల నిటారుగా ఎత్తాల్సిందే! ఆర్‌సీఎం మతస్తులు అధికంగా ఉండే ఈ గ్రామంలో 1850లో కానుకమాత చర్చిని నిర్మించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు అనగా 97 సంవత్సరాల పూర్వమే రూ.4 వేల వ్యయంతో అప్పట్లో ఈ చర్చి రూపుదిద్దుకుంది. 1832లో బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిర నిర్మాణానికి పూనుకోగా అది 1850లో పూర్తయినట్లు మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి చెప్పారు. 70 అడుగుల ఎత్తు 1000 మంది భక్తులు కూర్చోనే విధంగా ఈ ప్రార్థనా మందిరాన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో సిమెంట్ లేకపోవడంతో సున్నంతో గానుగ ఆడించి నాపరాళ్లతో నిర్మించారు. ఆ రోజుల్లో ఫాదర్ ఆదేశాల మేరకు ప్రతి క్రైస్తవ కుటుంబం నుంచి ఒకరో ఇద్దరు వచ్చి నిర్మాణ పనుల్లో పాలుపంచుకునే వారు. 13 ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ చర్చికి అనుబంధంగా 1978లో మరో చర్చిని నిర్మించారు. దీనిని ప్రస్తుతం రూ.5 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. 174 వసంతాలు నిండినా ఆ చర్చి చెక్కు చెదరకపోవడం విశేషం.

ఇద్దరు రైల్వే అధికారులకు

జాతీయ అవార్డులు



జేవీ అనూష, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్)



పీ ఆదినారాయణ, సీనియర్ సెక్షన్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్)

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 69వ రైల్వే వారోత్సవాల్లో ఈ అవార్డులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రదానం చేశారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్) జవ్వాది వెంకట అనూషకు కొత్త ఆవిష్కరణలు, ప్రక్రియలు, ఆర్థిక వ్యవస్థలలో చేసిన కృషికి అతి విశిష్ట సేవా పురస్కార్-2024 అవార్డు లభించింది. అలానే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో కొన్ని విభాగాలను పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పీ ఆదినారాయణకు కూడా అవార్డు లభించింది. వీరిద్దరిని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

గొప్పవారి స్ఫూర్తితో విజేతలుగా ఎదగాలి

- ఘనంగా ప్రారంభమైన వివా వీవీఐటీ 2024-25



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు..



మాట్లాడుతున్న వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయస్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటి 2024-25 వేడుకలు ఘనంగా శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా కృషి చేయాలని అన్నారు. గొప్పవారి నుంచి స్ఫూర్తిపొంది విజేతలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నేపథ్యంగా ఎంచుకున్న ది వరల్డ్ ఈజ్ వన్ (ప్రపంచమంతా ఏకం) నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వసుధైక కుటుంబాన్ని చాటేలా కళాశాల ప్రాంగణం మొత్తం ప్రపంచ దేశాలలోని సంస్కృతులు, పురాణాల ఆకృతులతో తీర్చిదిద్దారు. హిందూ తత్వశాస్త్రం, తాత్విక, భౌతిక భావనలను కలిగివున్న పవిత్ర సాధనం శ్రీచక్రం ఆకృతి ఆకట్టుకుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల వస్త్రధారణతో కూడిన ప్రతిరూపాలను యువజనోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల నుంచి 94 అంశాలలో పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలకు చెందిన 4500 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులు పెద్ద ఎత్తున క్రీడా పోటీలలో పాల్గొని విశేషంగా రాణించారు. తొలిరోజు ముగింపు కార్యక్రమంలో అతిధులుగా వీవీఐటి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వి జాన్సన్ అండ్ జాన్సన్ ఐటి మేనేజర్ ఆదిశేషారెడ్డి, అమెరికన్ ప్రొఫెసర్ దండు రాజు పాల్గొన్నారు. తొలిరోజు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్. కుమారస్వామి అధ్యాపకులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం

ధనుర్మాస ఉత్సవాల్లో ఆరవ పాశురం

మంగళగిరి సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యదుకుల తిలక రత్న ట్రస్టు ఆధ్వర్యంలో మంగళగిరి బాపూజీ విద్యాలయంలో జరుగుతున్న ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో శనివారం త్రిదండి చినజీయర్‌స్వామి ఆరవ పాశురాన్ని భక్తులకు వివరించారు. శ్రీమాన్ నేపాల్ కృష్ణమాచార్య స్వామి భాగవతం గురించి వివరించారు.

జోన్ డైరీ

● వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో సోమవారం ప్రకృతి వ్యవసాయం పై అవగాహన సదస్సు, మిద్దె తోటల పురస్కారాలను అందిస్తున్నట్టు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

● తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్ వద్ద ఆదివారం రాష్ట్ర మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు మాల ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎస్.జగదీష్ తెలిపారు.

30వ తేదీ లోగా

దరఖాస్తు చేసుకోవాలి

దుగ్గిరాల, డిసెంబరు 21: మండలంలో ఖాళీగా వున్న రేషన్ డీలర్ల నియామకం కోసం ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఐ. సునీత తెలిపారు. మండలంలోని దుగ్గిరాల, పేరకల పూడి, గొడవర్రు, కెఆర్‌కొండూరు, తుమ్మపూడి, చినపాలెం గ్రామాల్లో ఒక్కో డీలరు పోస్టు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల వారు తెనాలి ఆర్డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందచేయాలని తెలిపారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన

తాడేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను భర్తరఫ్ చేయాలని శనివారం ఉండవల్లి సెంటర్, అంబేద్కర్ నగర్, గుండిమెడ, మెల్లెంపూడి గ్రామాలలో సీపీఎం, కేవీపీఎస్ తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు పీ. మధు మాట్లాడుతూ దేశ ప్రజలకు అమిత్ షా బేషరతు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎం రవి, పల్లె కృష్ణ, సాంబశివరావుతదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలపై నిరసన

తాడేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై వేసిన రూ.1850 కోట్ల ట్రూఅప్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ఉండవల్లి గుంటూరు ఛానల్ హెడ్ స్లూయిస్ వద్ద పుష్కర కాలనీలో విద్యుత్ బిల్లులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

శాంతియుత జీవనమే క్రీస్తుమార్గం

● ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు
● కాకుమాను టీడీపీ కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కాకుమాను, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాంతి, కరుణ, దయ వంటి సద్గుణాలతో జీవించడమే మానవాళికి క్రీస్తు చూపిన మార్గమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమాను మండల టీడీపీ కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ప్రపంచంలో 98 శాతం మంది ప్రజలు మతాలు, కులాలకు అతీతంగా క్రిస్మస్ పండుగను జరుపుకుంటున్నారన్నారు. దైవానికి రూపం లేదని, మంచి చేసే వారు దైవంతో సమానమని అన్నారు. క్రీస్తు మార్గం అనుసరించడం ద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని, మనిషి ఎంత ఎదిగినా నేలమీదే నడవాలన్నదే యేసు క్రీస్తు సమాజానికిచ్చిన ముఖ్య సందేశమని తెలిపారు. మానవాళి అంతా దేవుని బిడ్డలేనన్నారు. సమాజంలో మనుషుల మధ్య నెలకొన్న అన్నిరకాల బేదాభిప్రాయాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం కృష్ణా వెస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయిన నువ్వుల సునీల్ చౌదరిని పూలమాలలు, దుశ్శాలువాతో సన్మానించారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్, నక్కల శైలజ, నూతి శరత్‌బాబు, తహసీల్దార్ వెంకటస్వామి, ఈవోపీఆర్డీ రవికుమార్, ఏఈ రవీంద్రారెడ్డి, ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్, నాయకులు పూర్ణచంద్రరావు, ప్రేమ చంద్, నక్కల అగస్టీన్, మాణిక్యరావు, పెద్ది రవీంద్రబాబు, తన్నీరు అప్పారావు, కోంద్రు శ్రీనివాసరావు, పొన్నం శ్రీనివాసరావు, యర్రాకులు దానయ్య, చుండూరు రాంబాబు, చెన్నుపాటి రామకృష్ణ, మండవ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


కాకుమాను టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్‌ను కట్ చేస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

వట్టిచెరుకూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేమల్లెపాడు గ్రామం లోని ఎంపీపీ స్కూల్లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎన్ఆర్ఐ అంకెం ఫణి మాధవి మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను, లైబ్రరీకి బీరువా, కుర్చీలను అందజేశారు. మరోఎన్ఆర్ఐ సీహెచ్ వెంకటలక్ష్మీ సత్యనారాయణ దుప్పట్లను పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పసుపులేటి శ్రీధర్, ఉపాధ్యాయులు రవికృష్ణ, సర్పంచ్ పాతూరి శివపార్వతి, ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సవాళ్లను చిరునవ్వుతో ఎదుర్కోవాలి


విద్యార్థినికి మెడల్‌ని అందజేస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నరేంద్ర, డాక్టర్ కృష్ణ ప్రసాద్

● కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
● ఘనంగా సిబార్ కళాశాల వార్షికోత్సవం
● పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎంతైతే ఆనందం ఉంటుందో అదే స్థాయిలో సవాళ్ళు కూడా ఎదురవుతుంటాయని, ఆ సవాళ్ళను చిరునవ్వుతో ఎదుర్కొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలోని సిబార్ దంతవైద్య కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్లనరేంద్రకుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎంతోమంది వ్యక్తుల మోములలో ఆత్మస్థైర్యంతో కూడిన చిరునవ్వు కురిపించగల శక్తి దంత వైద్యులకే ఉంటుందన్నారు. రోగులతో ఎంతో ప్రేమగా వ్యవహరించాలని, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం వస్తున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌ను పెమ్మసాని, నరేంద్ర కుమార్‌లు అందజేశారు. కార్యక్రమంలో సిబార్ డెంటల్ హాస్పటల్ డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ కృష్ణ మోహన్, డాక్టర్ ఎల్.దుర్గాప్రసాద్, డీసీఐ మెంబర్ డాక్టర్ రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డిపాల్గొన్నారు.

వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో

అంతర్జాతీయ సమావేశం

తుళ్లూరు, డిసెంబరు 21:(ఆంధ్రజ్యోతి) వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయంలో వాటర్ ఎనీర్జీ సొల్యూషన్ కోసం నెక్స్ట్ జనరేషన్ సస్టైనబుల్ మెటీరియల్స్ (సువాటు 24)పై మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ(యుకె), వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, యాన్సే యూనివర్శిటీ-సౌత్ కొరియా, తోహోకు యూనివర్శిటీ-జపాన్ సంయుక్త సహకారంతో నిర్వహించారు. నీరు శక్తికి సంబంధించిన అత్యవసర సవాళ్లను చర్చించటానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రఖ్యాత పరిశోధకులు విద్యావేత్తలు, ఒక చోట చేర్చడం ఈ సదస్సు లక్ష్యం.. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ ముత్తు ప్రభాకర్, డాక్టర్ సచీల్ శర్మ, ఇల్లా రమాకాంత్, ఇతర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న పలు యూనివర్శిటీల ప్రొఫెసర్‌లు

పాస్టర్ దంపతులకు వస్త్రాలు పంపిణీ

మంగళగిరి సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను పురస్కరించు కుని నియోజకవర్గంలోని అన్ని సంఘాల పాస్టర్ల దంపతులకు మంత్రి నారా లోకేశ్ సహకారంతో నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్నట్టు క్రిస్టియన్‌సెల్ నియోజక వర్గ అధ్యక్షుడు యర్రగుంట్ల భాగ్యారావు తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి లోకేశ్ ప్రతియేటా పాస్టర్ల దంపతులకు నూతన వస్త్రా లను అందజేస్తూ సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తు న్నారన్నారు. సమావేశంలో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోలుమట్ల ప్రేమ్‌కుమార్, ఎస్సీ సెల్ గుంటూరు పార్లమెంటు అధ్యక్షుడు వేమూరి మైనర్‌బాబు, నేతలు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

తాడికొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గంలోని 11 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు రూ.14,44,357 ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, పొన్నెకల్లు నీటి సంఘం అధ్యక్షులు గుంటుపల్లి మధుసూదనరావు, సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు, మైనార్టీ నాయకులు షేక్ సుభాని, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరి, (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో సీఎం సహాయనిధి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేశ్ సిఫార్సు మేరకు స్థానిక టీడీపీ నేతలు బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి చెక్కులను అందజేశారు.

సాఫ్ట్‌వేర్ రంగంలో కీలకంగా ఏఐ

దుగ్గిరాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ రంగంలో నెలకొన్న విప్లవాత్మకమైన మార్పుల్లో కీలకంగా మారిన ఏఐ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని, గూగుల్ సంస్థ ప్రతినిధి కే. మోజెస్ అన్నారు. మండల గ్రామం చింతలపూడిలోని ప్రియదర్శినీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మోజెస్ మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ మానవవనరులశాఖా మంత్రి నారా లోకేశ్ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఛైర్మన్ చందు రామావు మాట్లాడుతూ, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖరరావు, మంత్రి లోకేశ్‌లు సాఫ్ట్‌వేర్‌రంగంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకై కృషిచేస్తున్నారన్నారు. ప్రియదర్శినీ కళాశాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని శిక్షణ ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ పవన్‌కుమార్, కరస్పాండెంట్ చందు విజయలక్ష్మి, గూగుల్ ప్రతినిధి శివ, మహిళాఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్రవిష్ణు, వైస్ ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారైలో మ్యాథమేటిక్స్ డే వేడుకలు

మేడికొండూరు డిశంబరు21(ఆంధ్రజ్యోతి): గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మేడికొండూరు మండలం గుండ్లపాలెంలోని ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ ఈ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత మేధావుల్లో రామానుజన్ ఒకరన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ గణిత మోడల్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో సైన్స్ హ్యూమానిటీస్ హెచ్‌వోడీ డాక్టర్ కేఎస్ఆర్, గణిత జ్ఞాపకులు పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విభాగ అధిపతులలు పాల్గొన్నారు.

నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

మంగళగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మణి జన్మదిన వేడుక లను పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లో శనివారం తెలుగు మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షు రాలు ఆరుద్ర భూలక్ష్మీ హాజరై కేకును కట్ చేసి బ్రాహ్మణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు ఇండ్ల రజని, కేశనం భావన, గంజి సుధ, సాలా లీలావతి, వీరా రాధిక తదితరులు పాల్గొన్నారు. పదవ వార్డులో జరిగిన కార్యక్రమంలో తెలుగు మహిళలు ఉడతా లావణ్య, బిట్రా మాధురి, గోరంట్ల లావణ్య, బూదాటి విజయలక్ష్మీ, మల్లెల పుష్ప, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

26న సీపీఐ శత వసంతోత్సవం

మంగళగిరి సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీ జరుగనున్న సీపీఐ శత వసంత ఉత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన నియోజకవర్గ పార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సాక్షిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రత్తిపాడు, డిశంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండల పరిధిలోని చినకోండ్రుపాడు జాతీయ రహదారిపై తవుడు గిడ్డంగిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం నిల్వలను ప్రత్తిపాడు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు సివిల్ సప్లయ్ డీటీ శివశంకర్‌కు వచ్చిన పక్కా సమాచారం మేరకు ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడిచేసి 213 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం చీమకుర్తి జయప్రకాష్‌కి చెందినవిగా పోలీసుల విచారణలో తెలిసింది. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు, వేమారెడ్డి

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

మంగళగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 52వ పుట్టినరోజు వేడుకలను వైసీపీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించాయి. మంగళగిరి వైసీపీ కార్యాల యంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి కేకు కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు (ఆంధ్రజ్యోతి): పేరేచర్ల శివ పార్వతి కాలనీలో వైసీపి అభిమానులు ఏర్పాటు చేసిన 45 కేజీల కేక్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి కట్ చేశారు.

తుళ్లూరు, (ఆంధ్రజ్యోతి): తుళ్లూరు మండలంలో దొండపాడు తుళ్లూరులో గ్రామాలలో నిర్వహించిన మాజీ సీఎం జగన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో తాడికొండ నియోజకవర్గ వైసీపీ కన్వీనర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) పాల్గొని కేక్ కత్తిరించి, కార్యకర్తలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రేషన్ షాపులకు దరఖాస్తు చేసుకోవాలి

పొన్నూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పొన్నూరు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న, నూతన రేషన్ షాపులకు అర్హులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జియావుల్ హక్ శనివారం తెలిపారు. మండలంలోని మునిపల్లె, మాచవరం, వెల్లలూరు, పొన్నూరు పట్టణంలోని రెండు దుకాణాలు, చేబ్రోలులోని నారాకోడూరు, చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, చేబ్రోలు, శలపాడు, శ్రీరంగపురం, గొడవర్రు, వేజండ్ల, పాతరెడ్డిపాలెం రేషన్ దుకాణాలు వివిధ కారణాలతో ఖాళీ అయినట్లు చెప్పారు. కొత్తగా చేబ్రోలు మండలంలోని నారాకోడూరు, వేజండ్లలో రెండు, వడ్లమూడిలో మూడు దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వం అదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. అర్హులు ఈనెల 30వ తేదీలోగా తమ దరఖాస్తులను తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేయాల్సిందిగా తహసీల్దార్ సూచించారు.

సుబ్బారాయుడు ధర్మసత్రం అవకతవకలపై విచారణ చేయాలి

పొన్నూరుటౌన్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలపాటి సుబ్బరాయుడు ధర్మసత్రంలో జరుగుతున్న ఆర్థిక అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని పొన్నూరుకి చెందిన చెన్నుపాటి శ్రీనివాసరావు శనివారం దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసారు. సత్రం వార్షిక ఆదాయం రూ.25 లక్షలుగా ఉన్నప్పటికీ దాతలు కోరిన విధంగా అన్నదానం చేయటం కానీ, పేద ఆర్యవైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిపులు పంపిణీ చేయటంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. సత్రానికి చెందిన దుకాణాల లీజు కాల పరిమితి ముగిసిన తర్వాత రెన్యువల్ చేయటానికి నగదు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపించారు. ఆదాయం మొత్తం నకిలీ బిల్లులతో స్వాహా చేస్తునట్లు ఆరోపించారు. ఇటీవల మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి గ్రాట్యుటీ చెల్లింపుల విషయంలో కూడా అవకతవకలు జరిగినట్లు మృతుడి కుటుంబీకులు ఆరోపిస్తున్నారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీపీఐ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కోరారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26వ తేదీకి పార్టీ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఎన్నో వీరోచితమైన పోరాటాలను కమ్యూనిస్టులు చేశారని, సమసమాజ స్థాపన కోసం పాటుపడ్డారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంలోని బీజేపీ పాలన సామాన్యులకు మోయలేని భారంగా మారిందన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్, చెరుకుమల్లి సింగారావు, శివ, సాయి, కళ్యాణ్, యశ్వంత్‌లు పాల్గొన్నారు.

జనవరి ఒకటిని పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలి

పొన్నూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జనవరి 1వ తేదీని పబ్లిక్ హాలి డేగా డిక్లేర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి శనివారం కోరారు. రాష్ట్రంలో ఉన్న మెజార్టీ ప్రజలు ఆలయాలకు, చర్చిలకు వెళ్లి నూతన సంవత్సరం సందర్భంగా పూజలు, ప్రార్ధనలు చేస్తారన్నారు. కనుక జనవరి 1వ తేదీని పబ్లిక్ హాలిడేగా ప్రకటించి ఫిబ్రవరి రెండవ శనివారం వర్కింగ్ డేగా పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో శనివారం పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా పురపాలక సంఘ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు పాల్గొని 143 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు, దుప్పట్లను అందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

రఫీని సన్మానించిన రాష్ట్ర ముస్లిం నాయకులు

కొల్లిపర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లిపరకు చెందిన టీడీపీ గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ మక్కా మదీనా యాత్రను ముగించుకుని రావటంతో శనివారం అజాద్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా, రాష్ట్ర కోశాధికారి షేక్ రహీమ్, విజయవాడ ముస్లిం కమిటీ నగర అధ్యక్షుడు సిలార్ బేగ్, తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి పఠాన్ ఫెరోజ్ ఖాన్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ జబీర్, షేక్ అబ్దుల్లా, షేక్ మునీర్, షేక్ బాజీ, అబ్దుల్ మజీద్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

తిరుమల స్వామి సేవలో బంజారాలకు అవకాశం కల్పించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో బంజారాలకు అవకాశం కల్పించాలని హథీరామ్ బావాజీ పరిరక్షణ కమిటీ సభ్యులు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కోరారు. శనివారం తెనాలిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. భక్తాగ్రేశ్వరుడు హథీరామ్ వంశీయులు తిరుమలను పాలించారని, బంజారాలు ఆ సమయంలో సుదూర ప్రాంతాల నుంచి వెళ్లి తిరుమలలో పలు సేవలు అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ నాయకులు రాములు, భాను, రాంచంద్, కృష్ణ, బాలకోటానాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస మహోత్సవాలు

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస వ్రత ప్రయుక్త శ్రీకృష్ణ దీక్ష మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీఎస్ఆర్ కళాశాల రోడ్డులోని ప్రాంగణంలో శనివారం నరేంద్ర రామానుజ దానస్వామి పూజలు చేశారు. శరణగతి ఘోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో అభిషేకం, శత నామార్చన, తిరుప్పావై సేవ, గోపూజ, కుంకుమపూజ, తీర్థఘోష్టి, సహస్ర నామ పారాయణ కార్యక్రమాలను మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో తిలకించారు.

భూ సమస్యలకు స్వస్తి పలికేందుకే గ్రామసభలు

● మంత్రి నాదెండ్ల మనోహర్



రెవెన్యూ గ్రామసభలో రైతుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

తెనాలి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలతో సతమతమవుతున్న రైతాంగానికి నేరుగా అదే గ్రామంలో వారి సమస్యలు తెలుసుకుని నిర్ణీత సమయంలోపు పరిష్కరించి వారికి అండగా నిలవాలన్న సదుద్దేశంతో రెవెన్యూ గ్రామ సభలను నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. మండలంలోని పెదరావూరు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూగ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలోని పలువురు రైతుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మనోహర్ మాట్లాడుతూ గతంలో రైతులకు సమస్యలు వస్తే మండల కార్యాలయాల చుట్టూతిరగాల్సి వచ్చేదని కూటమి ప్రభుత్వం నేరుగా ఆయా గ్రామాల్లోనే రైతులందరికీ ఉపయోగపడేలా అధికారులందరు ఒకచోటకే తెచ్చి సమస్య పరిష్కారానికి చొరవచూపడం జరిగిందన్నారు. సబ్‌కలెక్టర్ సంజనాసిన్హా, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణ, పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ జియావుల్ హక్



కుంచవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

పెదరావూరు రెవెన్యూ సభకు 24 అర్జీలు

మండలంలోని పెదరావూరులో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభకు రైతుల నుంచి 24 అర్జీలు అందినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. మ్యుటేషన్ కొరకు 15 రాగా సర్వేకి 9 వచ్చాయన్నారు. నిర్ణీత సమయంలోపు వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ఉప్పరపాలెంలో...

పొన్నూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 22 అర్జీలు దాఖలైనట్లు తహసీఈల్దార్ జియావుల్ హక్ తెలిపారు. మ్యూటేషన్ కోసం 13, పాస్ పుస్తకాల కోసం 7, ఎఫ్‌లైన్ దరఖాస్తులు 3, అడంగల్ మార్పు కోసం ఒక దరఖాస్తు అందాయి. రెవెన్యూ సదస్సులో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కుంచవరంలో...

కొల్లిపర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూమికి సంబంధించిన సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల్లో తెలియజేస్తే వాటిని పరిష్కరించటానికి వీలుకలుగుతుందని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శనివారం మండల పరిధిలోని కుంచవరంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్‌సిద్ధార్థ మాట్లాడుతూ భూమికి సంబంధించిన సమస్యలను రైతులు దరఖాస్తురూపంలో తెలియజేయాలన్నారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వివిధ సమస్యలపై 5 దరఖాస్తులు వచ్చాయని వాటిని విచారణ చేసి త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పద్మావతి, ఆర్ఐ కిశోర్, రెవెన్యూ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవులను సంస్కరించడానికి అవతరించిన దైవం ఏసుక్రీస్తు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



క్రిస్మస్ కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మానవులను సంస్కరించడానికి సత్ప్రవర్తనతో మెలగడానికి, సంస్కారవంతులుగా నడిపించడానికి భూమిపై అవతరించిన దైవం ఏసుక్రీస్తు అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు పాఠశాల విద్యార్థులు, నిర్వాహకులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రీస్తు జననం గురించి విద్యార్థులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహూతులను అలరించాయి. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సెయింట్ ఆన్స్ పాఠశాలతో తమ కుటుంబానికి విడదీయరాని అనుబంధం ఉందన్నారు. పాఠశాల ప్రారంభించిన సమయంలో తన తండ్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి సహకారం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పదవ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, షీల్డ్ అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లాలీపాల్, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ అల్ఫెడ్, ఫాదర్ చరణ్ పాల్గొన్నారు.

బ్రాహ్మణకోడూరులో...

మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు గ్రామంలో చైల్డ్ హోమ్ ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ క్రిస్మస్ కేక్‌ను కోసి పంచిపెట్టారు. అనంతరం క్రిస్మస్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో దైవ ప్రార్థనలు, ప్రసంగాలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. ఈ వేడుకల్లో చైల్డ్ హోమ్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ...

భూమిపై చెడును పారద్రోలి మంచిని వ్యాప్తి చేయడానికి భూమిపై అవతరించిన దైవం యేసుక్రీస్తు అని ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిటీ సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ కేకును కోసి పంచిపెట్టారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సర్వమానవాళి సోదర భావంతో మెలగాలని సూచించారన్నారు. పేదలను ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో...

తెనాలి క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు ప్రబోధించిన ప్రధాన సూత్రాలు ప్రేమ, క్షమ, దయ, కరుణ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అప్పుడే జీవితం, సమాజం ఆనందభరితం అవుతుందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ తెలిపారు. తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన కమ్యూనిటీ సెమీ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్రీస్తు దారి తప్పిన మానవాళికి తన నడవడిక ద్వారా, తన బోధనల ద్వారా గమ్యాన్ని సూచించారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల క్రిస్మస్ పాటలు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా కోర్టు అటెండర్స్‌కి చీరలు అందించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు గుమస్తాలు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

పేదలకు నాణ్యమైన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



అన్న క్యాంటీన్‌లో ఆహార పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్న పేదలకు స్వల్ప ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించేలా ప్రభుత్వం అన్న క్యాంటీన్‌లను ఏర్పాటు చేసిందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నక్యాంటీన్‌లో మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆహారం అందిస్తున్న తీరును శనివారం పరిశీలించారు. ఆయన క్యాంటీన్‌లో ఆహారం తినే వారితో మాట్లాడి నాణ్యతాప్రమాణాల విషయంలో ఆరా తీశారు. అంతా బాగుందని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ అన్నక్యాంటీన్‌ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ వినియోగదారులకు వేడిగా నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేఎంజే కళాశాల వద్ద డ్రెయిన్‌లను పరిశీలించిన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

చెంచుపేటలోని జేఎంజే కళాశాల వద్ద, అంగలకుదురు రోడ్ల వెంట ఉన్న మురుగు కాలువలను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల పరిశీలించారు. కాలువలలో పేరుకుపోయిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ న్యాయవాది కాళిదాసు

కొల్లిపర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది, రిసోర్స్‌పర్సన్ కట్టా కాళిదాసు అన్నారు. కొల్లిపర మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు ఎంపీపీ భీమవరపు పద్మావతి అధ్యక్షత వహించారు. కాళిదాసు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు అనేక రకాలుగా చెడు వ్యసనాలకు బానిస అవుతున్నట్లు తెలిపారు. సీనియర్ న్యాయవాది, రిసోర్స్‌పర్సన్ యూన్సీ మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు, చిన్నారులకు ప్రత్యేక చట్టాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ నూతన టెక్నాలజీ కారణంగా ప్రపంచం ముందుకుపోతుందని దానికి అనుగుణంగా సైబర్ నేరాలు కూడా పెరిగి పోతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, ఈవోపీఆర్‌డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలపై భయం వీడాలి : ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరుటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పరీక్షలపై భయం వీడి ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో పది విద్యార్థులకు శనివారం నన్నపనేని శ్రీహరిరావు సహకారంతో మోడల్ ప్రశ్నాపత్రాలు, పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆడపిల్లల విద్యను ప్రోత్సహించడానికి ఇటీవల డీవీసీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 500 మంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు తెలిపారు. మారీసుపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీని కారణంగా రైతులకు తక్కువ ధర లభిస్తుందన్నారు. ఇటీవల వర్షాల వలన పంట తడిసిందని, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొంటామని చెప్పిన అధికారులు, మంత్రులు పట్టించుకోలేదన్నారు. రైతులకు నష్టం లేకుండా ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, శ్రీను, బుల్లియ్య, కృష్ణ, శివకుమార్, స్టీవెన్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాలకు మాజీ ముఖ్యమంత్రి జగన్ కృషి



దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ కృషి ఎంతగానో ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదినోత్సవం పురస్కరించుకుని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు హరేరామ్, కోటేశ్వరావు, నాగేశ్వరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లిపరలో జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని కేక్‌కట్ చేసి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. పేదలకు స్థానిక నాయకులతో కలిసి దుప్పట్లను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్‌లు పిల్లి రాధిక, అరుణాబాయ్, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, యూత్ నాయకుడు ఈదా యశ్వంత్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్, వైసీపీ గ్రామ అధ్యక్షుడు భీమవరపు శివకోటిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నందులపేటలోని మాంటిస్సోరి కిండర్ గార్డెన్ స్కూల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ జేమ్స్‌మోర్లే ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సీనియర్ టీచర్ శారద క్రిస్మస్ సందేశం ఇచ్చారు. గిఫ్ట్ ఫర్ ఆల్ అనే కార్యక్రమంలో బాలబాలికలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

వీరాంజనేయస్వామికి ధనుర్మాస విశేష పూజలు

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మారీసుపేట శివాలయంలోని దక్షిణ ముఖ వీరాంజనేయస్వామికి శనివారం ధనుర్మాస విశేష పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు గ్రంధిసేతు మాధవరావు, పొన్నూరు శశి, వరద శేషగిరిరావు, అంకమ్మ రాజు, హరిప్రసాద్, అర్చకులు ఫణిశంకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కోలాటం

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాస ఉత్సవాలలో మహిళలు ప్రదర్శించిన కోలాట అలరించింది. శరణగతి ఘోష్టి ట్రస్ట్ ఆధ్వర్యంలో బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో శనివారం రాత్రి కోలాటం ప్రదర్శించారు. నరేంద్ర రామానుజ దాసస్వామి ఆధ్వర్యంలో మున్నంగి భక్తులు కార్యక్రమం నిర్వహించారు.



విద్యార్థులకు మెడల్స్ పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నరేంద్ర, డాక్టర్ కృష్ణ ప్రసాద్ తదితరులు

సవాళ్లను చిరునవ్వుతో ఎదుర్కోవాలి

● కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
● ఘనంగా సిబార్ కళాశాల వార్షికోత్సవం
● పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎంతైతే ఆనందం ఉంటుందో అదే స్థాయిలో సవాళ్ళు కూడా ఎదురవుతుంటాయని, ఆ సవాళ్ళను చిరునవ్వుతో ఎదుర్కొనేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలోని సిబార్ దంతవైద్య కళాశాల వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఎంతోమంది వ్యక్తుల మోము లలో ఆత్మస్థైర్యంతో కూడిన చిరునవ్వు కురిపించగల శక్తి దంత వైద్యులకే ఉంటుందన్నారు. రోగులతో ఎంతో ప్రేమగా వ్యవహరించాలని, వృత్తి పట్ల అంకితభావంతో పనిచేయాలని పెమ్మసాని చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం వస్తున్న అధునా తన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభా వంతులైన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్‌ను పెమ్మసాని, నరేంద్ర కుమార్‌లు అందజేశారు. కార్యక్రమంలో సిబార్ డెంటల్ హాస్పటల్ డీన్ డాక్టర్ కృష్ణ ప్రసాద్, డైరెక్టర్ కృష్ణ మోహన్, డాక్టర్ ఎల్.దుర్గాప్రసాద్, డీసీఐ మెంబర్ డాక్టర్ రేవతి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డిపాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్ తదితరులు

రోడ్ల విస్తరణ పనులతో పట్టణాభివృద్ధి : మంత్రి మనోహర్

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగిపోతున్న జనాభాకు అనుగుణంగా పట్టణంలో సౌకర్యాలను కూడా మెరుగుపరుస్తూ తెనాలిని తీర్చిదిద్దుతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులో రూ. 67 లక్షలతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను మంత్రి మనోహర్ మున్సిపల్ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంలో మనోహర్ రోడ్డు ఆక్రమణలకు గురికావడంతో అధికారులను నిలదీశారు. వెంటనే నోటీసులు జారీచేసి వాటిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రాష్ట్రాభివృద్ధికి కంకణం కట్టుకుందని అందులో భాగంగా తెనాలి ప్రాంతాన్ని కూడా సుందరీకరిస్తున్నామన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టణంలో సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, చిన్నపాటి వర్షం కురిస్తే డ్రెయిన్‌లు నిండి రోడ్లపై చేరి అపరిశుభ్ర వాతావరణంలో ప్రజలు రాకపోకలు చేసేలా దిగజారిందని విమర్శించారు. అనంతరం విస్తరణ పనులపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు, ఏసీపీ శ్రీమన్నారాయణ, టీపీవో సాంబశివరావు, ఏఈ నూరిబాబు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలను వినియోగదారులకు అందించాలి

రైతు మార్కెట్ల ద్వారా నాణ్యమైన కూరగాయలు సరసమైన ధరలకు వినియోగదారులకు చేరువ చేసి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని మంత్రి మనోహర్ అన్నారు. స్థానిక శివాజీ చౌక్‌లోని రైతు మార్కెట్‌ను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మార్కెట్‌లో వివిధ స్టాల్స్‌లో ఉన్న కూరగాయల నాణ్యతను పరిశీలించారు. ధరల పట్టికల ప్రకారం కూరగాయలు అమ్ముతున్నారా, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అంటూ పలువురి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడుతూ నిబంధనలు పాటించకుంటే వారిపై తీసుకొనే చర్యలకు బాధ్యులౌతారన్నారు. అనంతరం అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సబ్సిడీ స్టాల్‌లోని బియ్యం, ఇతర ఉత్పత్తులను పరిశీలించి, వినియోగదారులు సద్వినియోగం చేసుకొనే తీరుని అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టాల్స్ ప్రారంభం నుంచి ఇప్పటివరకు అమ్మకాలు జరిపిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి మారుపేరుగా తెనాలి ప్రాంతాన్ని తీర్చిదిద్దుతాం

● రూ.25కోట్లతో అభివృద్ధి పనులు ● మంత్రి నాదెండ్లమనోహర్

తెనాలి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అభివృద్ధికి నోచుకోని తెనాలి నియోజవర్గంపై ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధికి మారుపేరుగా తీర్చుదిద్దుతామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. పట్టణంలోని జనసేనపార్టీ కార్యాలయంలో శనివారం మంత్రి మనోహర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో క్రీడలను ప్రోత్సహిస్తూ సువిశాల క్రీడా మైదానం, గ్రామీణప్రాంతాల్లో రోడ్లు అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు పోతున్నామన్నారు. ఆదేవిధంగా ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం, చినరావూరు పార్కు సుందరీకరణ వంటి పనులను చేపట్టడం జరిగిందన్నారు. తెనాలి-గుంటూరు-విజయవాడ ప్రధాన రహదారుల విస్తరణ, మెరుగైన వైద్యసదుపాయాలు, రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటి సరఫరా, తెనాలి కళాకారుల సంస్కృతి తదితర అంశాలను ప్రాథమికంగా తీసుకుని తెనాలి పట్టణాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తామన్నారు. తెనాలిలో రోడ్ల విస్తరణతోపాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి శాంతిభద్రతల పరిరక్షణకు బాధ్యత తీసుకుంటున్నామన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశామని ఇందులో భాగంగా తెనాలి, కొల్లిపర సీసీ రోడ్లు అభివృద్ధి చేయబోతున్నామన్నారు. 1.76 ఎకరాల్లో సువిశాల మున్సిపల్ భూమిని సేకరించి రూ. మూడుకోట్ల అంచనాతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతామన్నారు. అందులోనే వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టుల ఏర్పాటుతో పాటు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.20 లక్షలతో చినరావూరు పార్క్ మరమ్మతులు చేపట్టి డిసెంబరు 30నాటికి సుందరీకరణ చేయబోతున్నామని వివరించారు. రూ.1.15కోట్లతో తెనాలి ఐతానగర్‌లో ఐకర్స్ పార్క్ నిర్మాణం చేపడతామని సంక్రాంతి పండుగ లోపు దుగ్గిరాల, మంగళగిరి రోడ్డు మరమ్మతులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ భరోసా

తెనాలి రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో అనారోగ్యసమస్యలతో వైద్యసాయం కోసం సీఎంఆర్ఎఫ్‌కింద అప్లికేషన్లు పెట్టుకున్న బాధిత కుటుంబసభ్యులకు మంత్రి మనోహర్ రూ.1,21,329ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.